ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కర్నూలు

జిల్లా వార్తలు 5

బుధవారం 8 జనవరి 2025

బసినేపల్లిలో వజ్రం లభ్యం

మద్దికెర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్దికెర మండలంలోని బసినేపల్లి గ్రామంలో ఓ వ్యవసాయ కూలీకి వజ్రం లభ్యమైంది. గ్రామంలో వ్యవసాయ తోటలో పనులు చేస్తుండగా.. వజ్రం లభ్యం కావడంతో పెరవలి గ్రామానికి చెందిన వ్యాపారికి రూ.1.50 లక్షలకు అమ్మినట్లు తెలిసింది. ప్రతి ఏడాది ఈ ప్రాంతాల్లో వజ్రాలు లభ్యం కావడం సర్వసాధారణం. వ్యవసాయ కూలికి వజ్రం లభించడంతో ఆ ఇంట ఆనందం నెలకొంది.

మద్దతు ఒట్టిదే..!



- సిఫారసులకు ఆమోదం లభించేనా.?
- పీఎం కిసాన్ రూ.12వేలకు పెంపు
- మద్దతు ధరలకు చట్టబద్ధత
- కేంద్రానికి సిఫారసు చేసిన పార్లమెంటు స్థాయి సంఘం

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పశుసంవర్థక ఆహార ప్రాసెసింగ్ రంగాలపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్థాయి సంఘం రైతులకు మేలు చేసేలా సంచలన సిఫారసులు చేసింది. వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)లకు చట్టబద్ధత కల్పించడంతో పాటు పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని సిఫారసుల్లో పేర్కొన్నారు. రైతుల దీర్ఘకాలిక డిమాండ్లపై స్థాయి సంఘం లోతైన అధ్యయనాన్ని ఇటీవల పూర్తి చేసింది. ఈ అధ్యయనాల నివేదికలను గత మంగళవారం పార్లమెంటులో సమర్పించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. నిజంగా ఈ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తే రైతులకు చాలా మేలు జరుగుతుంది. ఇప్పటి దాకా కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పీఎం కిసాన్ పథకాన్ని రూ. 6వేల నుంచి రూ.12వేలకు పెంచాలని పార్లమెంటు స్థాయి సంఘం సిఫారసు చేసింది. అదే విధంగా ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో వివిధ పంట ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయిస్తూ వచ్చింది. అయితే.. ఖచ్చితంగా ఈ ధరలు రైతులకు లభించేందుకు చట్టబద్ధత కల్పించలేదు. నామ్‌కే వాస్తేగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల నుంచి పంట ఉత్పత్తులను కొంటున్నాయి. దీనికి కూడా నానా రకాల నిబంధనలు పెట్టి రైతులకు మద్దతు ధర అందకుండా చేస్తున్నాయి. ఇటీవల దేశంలోని పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాల్లోని రైతులు కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో పార్లమెంటు స్థాయి సంఘం రైతులకు సంతోషాన్నిచ్చే సిఫారసులు చేయడం అన్నదాతలకు శుభపరిణామం అని చెప్పవచ్చు.

● కేంద్రం ప్రస్తుత సంవత్సరానికి ప్రకటించిన మద్దతు ధరలు ఇవే:

పంట	క్వింటానికి మద్దతు ధర రూ.లలో
వేరుశనగ	రూ.6,760
పత్తి	రూ.7121
కంది	రూ.7550
మొక్కజొన్న	రూ.2225
పప్పుశనగ	రూ.6783
వరి	రూ.2320
జొన్న	రూ.3371
సజ్జ	రూ.2625
రాగులు	రూ.4290
పెసర	రూ.8682
మినుములు	రూ.7400
పొద్దుతిరుగుడు	రూ.7280
నువ్వులు	రూ.9267

ఈ ధరలను ఖచ్చితంగా అమలు చేసేందుకు చట్టబద్ధత కల్పించాలని పార్లమెంటు స్థాయి సంఘం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. వీటిని అమలు చేస్తే మద్దతు ధర కోసం వ్యాపారులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉండదు.



ఈ సిఫారసులు అమలు చేయాలి



రైతులు పంట సాగులో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా కేంద్రం రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు చర్యలు తీసుకోవడం హర్షణీయం. సాగు ఖర్చుల అనుగుణంగా పీఎం కిసాన్ మొత్తాన్ని రూ.12 వేలకు పెంచాలి. అలాగే నిర్ణయించిన మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలి. పార్లమెంటు స్థాయి సంఘం సిఫార్సులను ప్రధాని మోదీ ఆమోదిస్తారని ఆశిస్తున్నాం.

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

కరువు బృందం కోసం నిరీక్షణ

- చివరికి రైతులకు నిరాశే
- జిల్లాలో పర్యటన లేనట్లే

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గత ఖరీఫ్‌లో జిల్లాలోని కౌతాళం, పెద్దకడుబూరు మండలాల్లో భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. నష్టాన్ని అంచనా వేయడానికి కేంద్ర బృందం వస్తుందని, తమకు సాయం అందిస్తుందని రైతులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. చివరికి వారి నిరీక్షణ ఫలించదని తేలిపోయింది. ఖరీఫ్‌లో జిల్లాలో చాలా పెద్ద ఎత్తున తుఫాను నష్టం జరిగినా రాష్ట్ర ప్రభుత్వం కేవలం రెండు మండలాల్లోనే పంట నష్టం జరిగినట్లు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం కౌతాళం మండలంలో 21,169 మంది రైతులు 9,728 హెక్టార్లలో పత్తి, మిరప తదితర పంటలు నష్టపోయారు. వీరికి రూ.16.45 కోట్ల నష్టపరిహారాన్ని అందించాలని కలెక్టర్ ప్రభుత్వానికి నివేదికను పంపారు. అదే విధంగా పెద్దకడుబూరు మండలంలో 13,872 మంది రైతులు 5,271 హెక్టార్లలో సాగు చేసిన పంటలు నష్టపోయారు. వీరికి రూ.8.78 కోట్ల పరిహారాన్ని అందించాలని నివేదికను పంపారు. ఈ రెండు మండలాల్లో 35,041 మంది రైతులకు 14,999 హెక్టార్లలో పంట నష్టానికి రూ.25.24 కోట్ల పరిహారం ఇవ్వాలని కలెక్టర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ నష్టాన్ని పరిశీలించేందుకు ఢిల్లీ నుంచి కేంద్ర బృందం త్వరలో వస్తుందని, తమకు జరిగిన పంట నష్టానికి పూర్తి సాయం అందుతుందని ఈ రెండు మండలాల రైతులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అయితే కేంద్ర బృందం అనంతపురంతో పాటు రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో పంట నష్టాన్ని మూడు రోజులుగా పరిశీలిస్తున్నారు. తమ పంట నష్టాన్ని కూడా చూసేందుకు వస్తారని రైతులు ఎదురు చూస్తున్నారు. అయితే కేంద్ర బృందం జిల్లాకు రావడం లేదని వ్యవసాయ శాఖ అధికారవర్గాలు తెలపడంతో వారిలో నిరాశ మొదలైంది.

● **నష్టపరిహారం అందుతుంది**



జిల్లాలోని కౌతాళం, పెద్దకడుబూరు మండలాల్లో రైతులు పంట నష్టానికి గురయ్యారు. కలెక్టర్ నివేదికను ప్రభుత్వానికి పంపించాం. కేంద్ర బృందం ఈ మండలాల్లో పంట నష్టాన్ని పరిశీలించేందుకు వివిధ కారణాల వల్ల రావడం లేదు. దీనికి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జిల్లా కలెక్టర్ పంపిన నివేది మేరకు ఆ మండలాల రైతులకు తప్పనిసరిగా పంట నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందజేస్తుంది.

- వరలక్ష్మి, జేడీ

జాతీయ రహదారులకు మోక్షం

- రూ.241.99 కోట్లతో ఆదోని బైపాస్ రోడ్డు
- రూ.607 కోట్లతో సంగమేశ్వరం-నల్లకాలువ, వెలుగోడు-నంద్యాల రెండు లైన్ల రహదారి
- కర్నూలు-డోన్ డబ్లింగ్, విద్యుదీకరణ పనులకు కూడా
- నేడు విశాఖ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన



కర్నూలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో రూ.848.99 కోట్లతో చేపట్టే రెండు ప్రధానమైన జాతీయ రహదారులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్రంలో 20 జాతీయ రహదారులు, రైల్వే డబ్లింగ్ పనులకు శంకుస్థాపన, మరో పది పనులు ప్రారంభోత్సవం కోసం ప్రధాని మోదీ నేడు విశాఖపట్నం రానున్నారు. అక్కడి నుంచి జిల్లాలో నిర్మించబోయే పనులకు వర్చువల్ ద్వారా భూమిపూజ చేస్తారని నేషనల్ హైవే విభాగం కర్నూలు ఈఈ శంకర్‌రెడ్డి మంగళవారం ఆంధ్రజ్యోతికి వివరించారు.

రిజిస్ట్రేషన్ల లాలూఛీ



- పైసలిస్తే ఎవరి భూమైనా రిజిస్ట్రేషన్
- అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డాగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- దళారుల దందా.. ఒక్కో డాక్యుమెంట్‌కు ఒక్కో రేటు
- రిజిస్ట్రేషన్ విలువపై ఒక శాతం మామూలు ఇవ్వాల్సిందే
- తాజాగా ఆదోని, నంద్యాల సబ్ రిజిస్ట్రార్లపై వేటు

● ఆదోని పట్టణానికి చెందిన ఎగ్గటి ఈశ్వరప్పకు శిల్పా సౌభాగ్య నగర్ పక్కనే సర్వే నంబరు 321-ఏలో 6.51 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. రియల్ ఎస్టేట్ రంగం విస్తరించడంతో ఇక్కడ ఎకరా రూ.5 కోట్ల చొప్పున రూ.35 కోట్ల పైమాటే. ఆ భూమిపై కన్నేసిన గోనేగండ్ల మండలం పెద్దమరివీడుకు చెందిన సి. ఈరన్న, నంద్యాలకు చెందిన ఆముదాల భాస్కర్ భూమిపై కన్నేశారు. నకిలీ డెత్ సర్టిఫికెట్ సహా భూమిపై సర్వహక్కులు ఉన్నట్లు బోగస్ డాక్యుమెంట్లు సృష్టించారు. అవి ఒరిజినలా..? బోగస్ సర్టిఫికెట్లా.? పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్ చేశారు. పక్కా సమాచారంతో బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది.

● ఆదోని పట్టణం మండిగిరి రెవెన్యూ గ్రామం సర్వే నంబరు 379/బి, 380ఏ పరిధిలో ఎస్కేడి కాలనీ ఎల్పీ నంబరు 3/83లో 300 చదరపు గజాల (6 సెంట్లు స్థలం) కురువ హనుమంతమ్మ పేరిట ఉంది. 1984 నవంబరు 18న కొనుగోలు చేశారు. ఈ స్థలం పక్కనే నివాసం ఉంటున్న డెంటిస్ట్ డాక్టర్ రవికిరణ్ స్వయాన తల్లి జె.లక్ష్మి ఫొటోతో కురువ హనుమంతమ్మ పేరిట నకిలీ ఆధార్ కార్డు సృష్టించి సమీప బంధువు చిప్పల సురేశ్‌బాబు పేరిట గత అక్టోబరు 16న ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. బాధితుడు ఎంకే హరీశ్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో భాగోతం వెలుగు చూసింది.

కర్నూలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సబ్ రిజిస్ట్రార్ హాజీమియా, సిబ్బంది కలసి రెండున్నర నెలల వ్యవధిలో రెండు అక్రమ రిజిస్ట్రేషన్లు చేశారు. ఈ భాగోతం వెనుక భారీ ఎత్తున నగదు చేతులు మారిందనే ఆరోపణలు ఉన్నాయి. అక్టోబరు 16న నకిలీ ఆధార్ కార్డు ఆధారంగా అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు గుర్తించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫలితంగా మరో అక్రమ రిజిస్ట్రేషన్ వెలుగులోకి వచ్చింది. సబ్ రిజిస్ట్రార్ హాజీమియాపై సస్పెన్షన్ వేటు పడింది. సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్ సహా ఐదుగురు అరెస్టయి ఊచలు లెక్కించాల్సి వచ్చింది. ఆ రోజే చర్యలు తీసుకొని ఉంటే.. ఈ రోజు రూ.35 కోట్లకు పైగా విలువైన భూమి అక్రమ రిజిస్ట్రేషన్ జరిగి ఉండేది కాదు కదా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆదోనిలో ఒక్కటే కాదు.. నంద్యాల సబ్ రిజిస్ట్రార్ నాయబ్ అబ్దుల్‌సత్తార్ ఎలాంటి విచారణ చేయకుండా కడప జిల్లా ప్రొద్దుటూరులో కోర్టు స్టేలో ఉన్న ఆస్తిని ఎనీవేర్ రిజిస్ట్రేషన్ కింద రిజిస్ట్రేషన్ చేశారు. సస్పెన్షన్ వేటుకు గురయ్యారు. వెలుగు చూసిన సంఘటనలు ఇవి. వెలుగులోకి రానివి ఎన్ని ఉన్నాయో..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంతేకాదు సబ్ రిజిస్ట్రార్ కార్యాయాలు దోపిడీ కేంద్రాలుగా మారాయనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు ఒక్కో రేటు చొప్పున.. 'లోపలి ఫీజు.. బయటి ఫీజు' పేరుతో దందా సాగిస్తున్నారు.

● కర్నూలు జిల్లాలో 11, నంద్యాల జిల్లాలో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. స్థిరాస్తులు క్రయ విక్రయాలు, దాన సెటిల్మెంట్లు (గిఫ్ట్ డీడ్), వీలునామా.. వంటి డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు వస్తుంటారు. రోజుకు సరాసరి 850 నుంచి వెయ్యికి పైగా వివిధ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయని సంబంధిత అధికారులు తెలిపారు. ముప్పాతిక శాతం భూములు, ప్లాట్లు, భవనాలు వంటి స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లే ఉంటాయి. 20 ఏళ్ల క్రితం ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో లైసెన్సుడ్ స్టాంప్ రైటర్లు ఉండేవారు. వారి పెత్తనం పెరగడం, అవినీతికి డాక్యుమెంట్ రైటర్లు కేంద్ర బిందువుగా మారడంతో 2002 మేలో అప్పటి ప్రభుత్వం డాక్యుమెంట్ రైటర్ల వ్యవస్థను రద్దు చేసింది. రికార్డుల్లో రద్దు జరిగినా.. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వారి పెత్తనానికి అడ్డుకట్ట పడలేదు. వారు లేనిదే ఒక్క డాక్యుమెంట్ కూడా రిజిస్ట్రేషన్ జరగడం లేదనేది అక్షర సత్యం. అదే క్రమంలో అక్రమార్కులు, డాక్యుమెంట్ రైటర్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సిబ్బంది చేతులు కలిపి అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



● **మారని తీరు..!**

ఆదోనిలో బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.35 కోట్లకు పైగా విలువైన 6.51 ఎకరాలు నకిలీ సర్టిఫికెట్లతో అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ హాజీమియా గతంలోనూ ఇలాంటి వివాదాల్లోనే చిక్కుకున్నాడు. గతంలో కర్నూలు, కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా పని చేసిన సమయంలో నిషేధిత జాబితాలో ఉన్న వక్ఫ్ బోర్డు స్థలాలను రిజిస్ట్రేషన్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. చనిపోయిన ఓ వ్యక్తిని బతికే ఉన్నట్లు కొందరు తప్పుడు పత్రాలు, నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. ఈ భాగోతంలో హాజీమియా పాత్ర కూడా ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తడంతో.. ఆ అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్లు తెలుస్తున్నది. సెప్టెంబరులో జరిగిన బదిలీల్లో డోన్ రిజిస్ట్రార్ కార్యాలయం సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై వెళ్లాడు. అక్కడి నుంచి ఆదోని సబ్ రిజిస్ట్రార్‌గా ఇన్‌చార్జిగా వెళ్లారు. నెల రోజులు గడవకనే దాదాపు రూ.1.75 కోట్లు విలువైన ఎస్కేడీ కాలనీలోని 6 సెంట్ల స్థలం అక్రమ రిజిస్ట్రేషన్ చేశారు. ఈ ఘటన మరవకనే.. ఏకంగా 6.51 ఎకరాల భూమిని బతికి ఉన్న వ్యక్తి చనిపోయినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్, బోగస్ డాక్యుమెంట్లు తీసుకొస్తే అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడం వెనుక అంతర్యమేమిటి..? అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. విజిలెన్స్ అధికారులు కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గతేడాది కాలంలో జరిగిన రిజిస్ట్రేషన్లను క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలిస్తే ఇలాంటి అక్రమ రిజిస్ట్రేషన్లతో పాటు అక్రమ వసుళ్ల భాగోతం వెలుగు చూస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

● **ఒక్కో డాక్యుమెంట్‌కు ఒక్కో రేటు**

కర్నూలు జిల్లాలో 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నా.. కర్నూలు, కల్లూరు, ఆదోని, ఎమ్మిగనూరు, అలూరు, కోడుమూరు, పత్తికొండ వంటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో.. నంద్యాల జిల్లాలో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉంటే.. నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, డోన్, బనగానపల్లె రిజిస్ట్రార్ కార్యాలయాల్లో మెజార్టీగా డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ప్రతి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు పరిసరాల్లో 15-35 మందికి పైగా డాక్యుమెంట్ రైటర్లు ఉన్నారు. దస్త్రాలు రిజిస్ట్రేషన్ చేయిస్తే స్టాంపుడ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు కాదని.. అనధికారిక వసూళ్లకు తెరతీశారు. ఒక్కో డాక్యుమెంట్‌కు ఒక్కో రేటు చొప్పున వసులు చేస్తున్నారు. మెజార్టీ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ విలువపై 7.5 శాతం స్టాంప్ డ్యూటీతో పాటు ఒక శాతం మాముళ్ల అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అదే వివాదాల్లో ఉన్న ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయడానికి రూ.లక్షల్లో డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రతి డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు రూ.2-5 వేలు వసులు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. దస్త్రాల్లో లోపాలు ఉంటే రూ.వేలు, లక్షల్లో వసులు చేస్తున్నారు.

● **కళ్లకు గంతలు కట్టుకున్నారా..?**

ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగే రిజిస్ట్రేషన్లలో అక్రమాలు జరకుండా నివారించాలంటే ఆకస్మిక తనిఖీలు చేస్తూ పారదర్శక సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలి. అయితే తనిఖీలు చేయడం లేదని, అక్రమ వసుళ్లలో కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారులు కొందరికి వాటాలు అందుతుండడంతో తనిఖీ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరుగుతున్న అక్రమ వసూళ్లకు, అక్రమ రిజిస్ట్రేషన్లకు కళ్లెం వేయాలని పలువురు కోరుతున్నారు. ఆదోని, నంద్యాలలో వెలుగు చూసిన అక్రమ రిజిస్ట్రేషన్లు, అక్రమ వసుళ్లపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కర్నూలు డీఐజీ పీజీఎస్ కళ్యాణి, కర్నూలు డీఆర్‌ఓ చెన్నకేశవరెడ్డి వివరణ కోసం ఆంధ్రజ్యోతి ఫోన్లో ప్రయత్నించగా వారు అందుబాటులోకి రాలేదు.

ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై వేటు

ఆదోని, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆదోని సబ్ రిజిస్ట్రార్ హాజీమియాతో పాటు సీనియర్ అసిస్టెంట్ ఈరన్న, జూనియర్ అసిస్టెంట్ రమేష్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదోని పట్టణంలోని శిల్ప సౌభాగ్య నగర్ సమీపంలోని ఎగ్గటి ఈశ్వరప్పకు చెందిన 321/ఏ సర్వే నెంబరులోని 6.51ఎకరాల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. నంద్యాలకు చెందిన ఆముదాల భాస్కర్ అనే వ్యక్తి ఎగ్గటి ఈశ్వరప్ప కుమారుడిగా నకిలీ డాక్యుమెంట్లును సృష్టించి, తన తండ్రి ఈశ్వరప్ప 2009లోనే మరణించినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్‌తో పాటు ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్లను ఏర్పాటు చేసుకుని పెద్ద మర్రివీడు గ్రామానికి చెందిన చాకలి ఈరన్నకు విక్రయించారు. రిజిస్ట్రేషన్ చేసే ముందు కనీసం డాక్యుమెంట్లను పరిశీలించకుండానే అధికారులు రిజిస్ట్రేషన్ చేశారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులుగా ఆదోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డీఆర్ చెన్నకేశవరెడ్డి పూర్తిస్థాయిలో విచారణ చేశారు. నకిలీ డాక్యుమెంట్లు ద్వారా అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధిత రైతు ఎగ్గటి ఈశ్వరప్ప ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సబ్ రిజిస్ట్రార్ హాజీమియాతో పాటు సీనియర్ అసిస్టెంట్ ఈరన్న, జూనియర్ అసిస్టెంట్ రమేష్, డాక్యుమెంట్ రైటర్ మెహబూబ్, పొలాన్ని విక్రయించిన నంద్యాలకు చెందిన ఆముదాల భాస్కర్, పొలాన్ని కొనుగోలు చేసిన పెద్ద మర్రివీడుకు చెందిన చాకలి ఈరన్నపై టూ టౌన్ సీఐ సూర్యమోహన్ రావు కేసు నమోదు చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సబ్ రిజిస్ట్రార్‌తో పాటు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కళ్యాణి సస్పెండ్ చేశారు.



సబ్ రిజిస్ట్రార్ హాజీమియా | సీనియర్ అసిస్టెంట్ ఈరన్న | జూనియర్ అసిస్టెంట్ రమేష్

ప్రభుత్వ భూమిలో ప్రైవేట్ వెంచర్..!

- చిన్నటేకూరు సర్వే నెం-1లో భూమి ఆక్రమణ 6
- లేఅవుట్ వేసి అనుమానం రాకుండా హద్దురాళ్లుగా మొక్కలు

10న కర్నూలుకు మంత్రి నారా లోకేశ్ 6



ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వెంచర్..!

- చిన్నటేకూరు సర్వే నెం-1లో భూమి ఆక్రమణ
- లేఅవుట్ వేసి అనుమానం రాకుండా హద్దురాళ్లుగా మొక్కలు
- గ్రావెల్ తోలి చదును చేసి రోడ్డు వేసిన అక్రమార్కులు
- పట్టించుకోని రెవెన్యూ శాఖ





డిసెంబరు 23న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు

కల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేస్తూ వెంచర్లు వేసి లక్షల రూపాయలకు విక్రయించేస్తున్నారు. ఇటీవలి కాలంలో కబ్జాపర్వం అధికమవుతోంది. తాజాగా ఇలాంటి ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. కొందరు కబ్జాదారులు ఏకంగా ప్రభుత్వ భూమిలోనే వెంచర్ వేసి విక్రయాలకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాల్సిన రెవెన్యూ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కల్లూరు మండలం చిన్నటేకూరు సర్వే నెంబరు 1లో 130 ఎకరాల హంద్రీపోరం బోకు భూమి ఉంది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో, జగన్నాథగట్టు ట్రిపుల్ ఐటీ, జాతీయ రహదారి ఇరువైపులా ఉన్న భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. బహిరంగ మార్కెట్‌లో ఎకరం ధర రూ.కోట్లలో పలుకుతోంది. దీంతో ప్రభుత్వ భూమి కనపడితే చాలు అక్రమార్కులు కబ్జాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ, వక్ఫ్, నది పోరంబోకు భూమిలో రూ.కోట్లు విలువ చేసే భూములను కొట్టేసి గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారం చేస్తూ అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో సర్వే నెంబరు 1లో హంద్రీ పోరంబోకు భూమి ఆక్రమణకు గురైంది. దాదాపు 4 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమార్కులు దర్జాగా ఆక్రమించి... ప్రైవేటు వెంచర్ వేసిన సంఘటన వెలుగు చూసింది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారుల్లో చలనం లేకుండా పోయిందని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హంద్రీనది పోరంబోకు భూములు ఆక్రమణకు గురికాకుండా రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

● లేఅవుట్ వేసి హద్దు రాళ్లుగా మొక్కలు

హంద్రీనది పోరంబోకు భూమి ఆక్రమించడమే కాక చదును చేసి లేఅవుట్‌తో అమాయక ప్రజలకు ప్లాట్లు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. పేపర్‌పై లేఅవుట్ తయారు చేసి క్రయ, విక్రయాలు జరిపినట్లు ఇప్పటికే దాదాపు రెండు రూ.కోట్ల మేర దందా జరిపారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం. అధికారుల అండదండలతోనే హంద్రీనది పోరంబోకు భూమి ఆక్రమణ జరుగుతున్నట్లు స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుని అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని సర్వత్రా డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. చిన్నటేకూరు గ్రామంలో ఓవ్యక్తి సర్వే నెం-1లోని హంద్రీనది పోరంబోకు భూమిలో ప్లాట్లు వేసి హద్దురాళ్లుగా మొక్కలు నాటినట్లు చిన్నటేకూరు వీఆర్వోకు ఫిర్యాదు చేశారు. అధికారులు పట్టించుకోక పోవడంతో గ్రామస్థులు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు డిసెంబరు 23న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీంతో ఆ వినతిని కల్లూరు తహసీల్దారుకు విచారణ నిమిత్తం పంపారు. దాదాపు 15 రోజులు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఆక్రమణకు గురికాకుండా రక్షణ బోర్డు ఏర్పాటు

చిన్నటేకూరు సర్వే నెంబరు 1లోని హంద్రీనది పోరం బోకుభూమి ఆక్రమణకు గురవుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. రెవెన్యూ గ్రామసభలు ఉన్నందున చర్యలు తీసుకోవడంలో కొంత ఆలస్యమైంది. వెంచర్ వేసిన ఆ భూమి ప్రభుత్వానిదే. ప్రజలు ప్లాట్లు కొని మోసపోవద్దు. తక్షణమే ఆక్రమణ భూమిలో రక్షణ బోర్డు ఏర్పాటు చేస్తాం. అలాగే ఉలిందకొండ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి, భూ ఆక్రమణకు పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతాం.

- కె.ఆంజనేయులు, తహసీల్దారు, కల్లూరు



చిన్నటేకూరు గ్రామం వద్ద హంద్రీనది పోరంబోకు భూమిలో వేసిన గ్రావెల్ రోడ్డు

ముక్కోటి ఏకాదశి వేడుకలు

● రాష్ట్ర స్థాయి బండలాగుడు, కబడ్డీ పోటీలు

బేతంచెర్ల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మద్దిలేటి స్వామి క్షేత్రంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను పురస్కరించుకుని రైతు సంబరాల్లో భాగంగా రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఉప కమిషనర్ ఆలయ ఈవో రామాంజనేయులు మంగళవారం తెలిపారు. రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో 6 పండ్ల ఎద్దుల విభాగంలో విజేతలకు మొదటి నుంచి వరుసగా 8 బహుమతులు రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు దాతల సహకారంతో ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

● 10న రాష్ట్ర స్థాయి పెద్ద బండలాగుడు పోటీలు: ఈ నెల 10న న్యూకేటగిరీ ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు మొదటి నుంచి 9 బహుమతులు రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలు నగదును అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

● జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు: ఏకాదశి వేడుకల సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఈ నెల 9వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. ఈ కబడ్డీ పోటీల్లో విజేతలకు మొదటి నుంచి వరుసగా 5 బహుమతులు రూ.15వేలు, రూ.12వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.3వేలు నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలిపారు. పాల్గొనే జట్లు తమ పేర్లను సెల్‌ఫోన్స్ 9160638848, 9652297198, 9014590115 సంప్రదించాలని తెలిపారు.

వందేళ్ల ఆలయ ఉత్సవాలను ఘనంగా నిర్వహించండి

ఉడిపి పెజావర్ పీఠాధిపతి విశ్వప్రసన్న తీర్థులు



శ్రీరామ విగ్రహ భూమి పూజ చేస్తున్న ఉడిపి పెజావర్ పీఠాధిపతి విశ్వప్రసన్న తీర్థులు

కర్నూలు కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని శ్రీరామాలయంలో శతాబ్ది బ్రహ్మోత్సవాలు ఆలయ విశిష్టతను చాటిచెప్పేలా ఘనంగా నిర్వహించాలని ఉడిపి పెజావర్ పీఠాధిపతి విశ్వప్రసన్న తీర్థులు అన్నారు. మంగళవారం ఆలయంలో నిర్మిస్తున్న 20 అడుగుల శ్రీరామ విగ్రహ నిర్మాణానికి ఆయన భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విశ్వప్రసన్న తీర్థులు మాట్లాడుతూ నగరంలో అతి ప్రాచీనమైన ఈ ఆలయ విశిష్టత ఎంతో ఉందని చెప్పారు. ఆలయ మొదట అర్చకత్వం వహించిన తర్క విద్వాన్ మాళిగి రామ్మూర్తి ఆచార్యుల వారికి తమ గురువులైన విశ్వేశతీర్థ శ్రీపాదలకు ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మాళిగి హనుమేశాచార్యులు మాట్లాడుతూ 1921 నుంచీ 1971 వరకు తమ పూర్వీకులు, ఆ తర్వాత తాను బాధ్యతలు చేపట్టానని అన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 12 నుంచి 18 వరకు సప్తరాత్రి శతాబ్ది బ్రహ్మోత్సవాలు ఆలయంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఉత్సవాలను భక్తులంతా విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, ఉపాధ్యక్షుడు మాళిగి వ్యాసరాజ్, వీహెచ్‌పీ నాయకులు సందడి మహేష్, మాళిగి భానుప్రకాశ్, ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు చిల్కూరు ప్రభాకర్, విఠల్‌శెట్టి, విఠల్‌రావు, చంద్రకాంత్, జయతీర్థ, వేదవ్యాస్, సత్యప్రియ, నీలి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లుగా ముగ్గురు ప్రమాణ స్వీకారం

కర్నూలు కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాల్మీకి బోయ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా జిల్లాకు చెందిన ముగ్గురు ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం విజయవాడలోని బీసీ వెల్ఫేర్ భవన్‌లోని కార్పొరేషన్ ఛాంబర్‌లో వాల్మీకి బోయ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. కోడుమూరుకు చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీ నాయుడు, కర్నూలుకు చెందిన టీడీపీ నాయకురాలు సంజీవలక్ష్మి, కర్నూలుకు చెందిన జనసేన పార్టీ నాయకుడు తోళ్ల మంజునాథ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మురళీనాయుడు మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆర్.గోపీ శ్రీనివాస్, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, జిల్లా అధ్యక్షుడు కనిగిరి నీలకంఠకు కృతజ్ఞతలు తెలియజేశారు.



డైరెక్టర్లుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ ఛైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ

సీమకు ఉజ్వల భవిష్యత్తు: మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, జనవరి7 (ఆంధ్రజ్యోతి) : బనకచర్ల-గోదావరి అనుసంధానంతో రాయలసీమకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుదని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మంగళవారం నంద్యాల రూరల్ తహసీల్దారు కార్యాలయాన్ని మంత్రితో పాటు కలెక్టరు రాజకుమారి, జేసీ విష్ణుచరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీమ చివరి భూములకు నీరుపారించాలన్న తపనతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గోదావరి- బనకచర్ల అనుసంధాన నిర్ణయం తీసుకున్నారన్నారు. జిల్లాలో పెరుగుతున్న అవసరాల దృష్ట్యా నంద్యాల రెవెన్యూ కార్యాలయాన్ని రెండుగా విభజించి రూరల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి అన్ని కార్యాలయాలు ఒకే ప్రదేశానికి తీసుకువచ్చి ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల మండలంలో 20 రెవెన్యూ గ్రామాలున్నాయన్నారు. ఇతర సర్వీసులకు సంబంధించిన అంశాలు అధికంగా ఉన్న నేపథ్యంలో రూరల్ మండల ఏర్పాటుకు ప్రభుత్వం అంగీకరించిందన్నారు.



రూరల్ తహసీల్దారు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

దేవరకు వేళాయె...

- ఐదేళ్ల తర్వాత కోసిగిలో మారెమ్మ ఉత్సవాలు
- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- దేవరకు ముస్తాబైన పొట్టేళ్లు
- నేటి నుంచి దేవర ప్రారంభం



దేవర వేడుకలకు పొట్టేళ్లు



విద్యుద్దీపాలతో కోసిగిలోని ప్రధాన వీధులు



ముసలి మారెమ్మ అమ్మవారికి గజమాలతో, కలశాలతో వెళుతున్న వాల్మీకినగర్ వాసులు

కోసిగి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మహాదేవరకు కోసిగి గ్రామం ముస్తాబైంది. ఐదేళ్ల తర్వాత జరుగుతున్న దేవర సందర్భంగా కోసిగిలోని కింది మారెమ్మ దేవాలయం, ముసలి మారెమ్మ దేవాలయం సిద్దప్ప పాలెం మారెమ్మ దేవాలయం, సుంకులమ్మ దేవాలయం, నాడిగేని గేరి మారెమ్మ దేవాలయం కట్ట, రంగప్పగట్టు మారెమ్మ దేవాలయం, గాంధీనగర్‌లోని మారెమ్మ, ఒకటోవార్డులోని సుంకులమ్మ ఆలయ కమిటీ పెద్దలు ఆలయాలను ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలంకరణలో మారెమ్మ దేవాలయాలు వెలిగిపోతున్నాయి. బుధవారం నుంచి జరిగే దేవర సందర్భంగా పొట్టేళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతున్నాయి. రూ.లక్షలు విలువ చేసే పొట్టేళ్లను దేవర వేడుకల కోసం పోటీ పడి మరీ ప్రజలు ఉత్సవాలకు సిద్ధం చేసుకున్నారు. సిద్దప్పపాలెం మారెమ్మ దేవాలయం, కింది మారెమ్మ దేవాలయం, ముసలి మారెమ్మ దేవాలయాలను పుష్పాలంకరణతో అలంకరించి ఆలయ కమిటి పెద్దలు ముస్తాబు చేశారు. దేవర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ ఉపేంద్రబాబు ఆధ్వర్యంలో కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

10న కర్నూలుకు మంత్రి నారా లోకేశ్



కర్నూలు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ 10వ తేదీ శుక్రవారం కర్నూలుకు రానున్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, టీజీ శిల్పా దంపతుల కుమార్తె టీజీ శ్రీఆర్యపాన్య, ప్రముఖ వ్యాపారవేత్త బొమ్మిడాల రాజా, రమాదేవి దంపతుల కుమారుడు బొమ్మిడాల వెంకటశ్రీ నలిన్‌ల వివాహం డిసెంబరు 26న హైదరాబాద్‌లోని జరిగిన విషయం తెలిసిందే. ఈ నెల 10వ తేది శుక్రవారం స్థానిక ఎస్ఏపీ క్యాంప్‌లో ఉదయం 11 గంటలకు రిసెప్షన్ నిర్వహించనున్నారు. ఈ ఫంక్షన్‌కు ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేశ్ హాజరు కానున్నారు. ముందు రోజు 9వ తేదీ గురువారం అనంతపురం జిల్లా పర్యటనను ముగించుకొని రాత్రి 11 గంటలకు కర్నూలు నగరంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. రాత్రి అక్కడే బస చేసి 10వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రభుత్వ కళాశాలలను పరిశీలిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ఎస్ఏపీ క్యాంప్ మైదానం చేరుకుని నూతన వధూవరులను ఆశీర్వదిస్తారు. అనంతరం 1:30 గంటలకు కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు బయలుదేరుతారు.

రహదారులకు మోదీ శంకుస్థాపన

(5వ పేజీ తరువాయి)

కర్ణాటక రాష్ట్రం బళ్లారి సమీపంలోని హగరి నుంచి ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, రాయచూరు మీదుగా జాతీయ రహదారి-167 2012-13లో నిర్మించారు. ఆదోని పట్టణంలో ఈ జాతీయ రహదారి వెళ్తుంది. ట్రాఫిక్ సమస్యలు దృష్ట్యా ఆదోని-ఆలూరు రోడ్డు నుంచి ఆదోని-పత్తికొండ రోడ్డు దాటి ఆదోని-ఎమ్మిగనూరు రోడ్డును కలుపుతూ 7.3 కి.మీల బైపాస్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 10 మీటర్ల తారు (బీటీ) రోడ్డు, రెండు వైపుల రెండు మీటర్లు మట్టిరోడ్డు (సోల్డర్) కలిపి 12 మీటర్లు వెడల్పుతో బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం రూ.241.99 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులకు ప్రధాని మోడీ వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేయబోతున్నారు.

● సంగమేశ్వరం-నంద్యాల నేషనల్ హైవేకు భూమి పూజ: తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ భారతమాల ప్రాజెక్టులో భాగంగా కల్వకుర్తి - నంద్యాల వయా ఆత్మకూరు 170 కి.మీలు జాతీయ రహదారి - 167కే నిర్మాణానికి కేంద్ర జాతీయ రాహదారుల మంత్రిత్వ శాఖ 170 కి.మీల రోడ్డు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు అవసరమైన నిధులు కూడా మంజూరు చేసింది. అందులో భాగంగానే నంద్యాల జిల్లాలో సంగమేశ్వరం-నల్లకాలువ వయా ఆత్మకూరు, వెలుగోడు-నంద్యాల వరకు 62 కి.మీలు 12 మీటర్లు (10 మీటర్ల బీటీ రోడ్డు) రెండు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి రూ.607 కోట్లతో టెండర్లు కూడా పూర్తి చేశారు. ఈ పనులకు నేడు ప్రధాని మోదీ వర్చువల్ ద్వారా భూమి పూజ చేసి శిలాఫలకం వేస్తారు. ఈ రహదారిలో భాగంగా సంగమేశ్వరం చెంత కృష్ణా నదిపై 900 మీటర్లు పొడవు పర్యాటకులను ఆకట్టుకునేలా ఐకాన్ తీగల వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దాదాపు రూ.400 కోట్లతో నిర్మించే ఈ ఐకానిక్ తీగల వంతెన నిర్మాణం పనులు తెలంగాణ రాష్ట్రం చేపట్టబోతుంది. ప్రస్తుతం టెండర్ల దశలో ఉందని ఇంజనీర్లు పేర్కొన్నారు. నేషనల్ హైవే-167కే, ఐకానిక్ తీగల వంతెన నిర్మాణం పూర్తి అయితే నంద్యాల, కడప జిల్లాల ప్రజలు, వాహనదారులు హైదరాబాద్‌కు వెళ్లాలంటే దాదాపు 70 కి.మీల వరకు దూరం తగ్గుతుందని ఇంజనీర్లు పేర్కొన్నారు.



● కర్నూలు-డోన్ డబ్లింగ్ రైల్వే లైన్: కాచిగూడ (హైదరాబాద్)-డోన్ ప్రధాన రైల్వే మార్గం. డబ్లింగ్, విద్యుదీకరణ రైల్వేలైన్‌గా ఆధునికీకరణ చేయాలని ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదన ఉంది. ఇప్పటికే మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్ పనులు పూర్తయ్యాయి. మహబూబ్‌నగర్-డోన్ వయా గద్వాల, కర్నూలు, వెల్దుర్తి మీదుగా డబ్లింగ్ లైన్, విద్యుదీకరణ పనులు చేపట్టాలి. 197 కి.మీల ఈ పనులకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ రూ.2,208 కోట్లు కేటాయించింది. టెండర్లు కూడా పూర్తి చేసిందని అధికారులు తెలిపారు. ఈ పనుల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలో కర్నూలు - డోన్ వయా వెల్దుర్తి మీదుగా జిల్లాలో 54 కి.మీలు డబ్లింగ్ రైల్వే లైన్, విద్యుదీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులకు ప్రధాని నేడు విశాఖ నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు.



దొంగ దొరకలేదు

- పట్టుకోకుంటే వేటు తప్పదు
- ఆదోని త్రీ టౌన్ పోలీసులపై ఎస్పీ సీరియస్?


మురళి (ఫైల్)

ఆదోని రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో కోర్టుకు తరలిస్తుండగా అంతర్రాష్ట్ర దొంగ మురళి ఖాకీల కళ్లు కప్పి, కోర్టు గోడ దూకి పరారైన విషయం విదితమే. అయితే దొంగ దొరకలేదు. నాలుగు రోజుల క్రితం ఎమ్మిగనూరు బైపాస్‌లో దొంగతనాలకు పాల్పడుతున్న మురళిని పట్టుకొని స్థానికులు పోలీసులకు అప్పజెప్పారు. సోమవారం త్రీటౌన్ పోలీసులు దొంగను కోర్టుకు తరలిస్తుండగా, కోర్టు ఆవరణలో పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో ఎస్పీ మంగళవారం ఉదయం సెట్ కాన్ఫరెన్స్‌లో త్రీటౌన్ పోలీసులపై సీరియస్ అయినట్లు నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, దొంగను 24 గంటల్లోపు పట్టుకోకపోతే ఆ ఇద్దరి సిబ్బందిపై వేటు తప్పదని ఎస్పీ హెచ్చరించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయంపై త్రీటౌన్ హెడ్ కానిస్టేబుల్ శివభూషణం వివరణ కోరగా, దొంగ దొరకలేదని, సిబ్బంది గాలిస్తున్నారని చెప్పారు.

మహిళ ఆత్మహత్య

ఆదోని, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరాఠీగేరి కాలనీకి చెందిన శ్వేత(22) సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. శ్వేతకు మూడేళ్ల క్రితం నాగరాజు అనే వ్యక్తితో ప్రేమ వివాహమైంది. అయితే నాగరాజు జల్సాలకు అలవాటు పడడంతో పాటు మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ పోషణ భారం అవుతోందని శ్వేత పలుమార్లు భర్త నాగరాజుకు చెప్పినా మార్పు రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. శ్వేత తండ్రి కృష్ణమూర్తి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు సత్తార్ వలి కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో రైతు...

డోన్ రూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లెంపల్లె గ్రామానికి చెందిన రైతు బోయ సుధాకర్ (42) అప్పులబాధ తాళలేక మంగళవారం తెల్లవారుజామున పొలంలోనచెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. వివరాలు.. మల్లెంపల్లె గ్రామానికి చెందిన బోయ సుధాకర్‌కు గ్రామంలో రెండెకరాలు సొంత పొలం ఉండగా.. మూడెకరాలు కౌలుకు తీసు కుని సాగు చేసుకుంటున్నారు. మూడేళ్లుగా వేసిన వేరుశనగ, పత్తి తదితర పంటలు సరైన దిగుబడి రాలేదు. రూ.10 లక్షలకు పైగా అప్పు ఉంది. దీంతో అప్పులు ఎలా తీర్చాలోనని మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సుధాకర్‌కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.


సుధాకర్ (ఫైల్)

వలస కార్మికుడు..

వెల్దుర్తి టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఇటుకల బట్టీ కర్మాగారంలో పని చేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు దుర్యోధన్ బెహరా (42) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. దుర్యోధన్ బెహరా కొన్నేళ్లుగా రవి ఇటుకల బట్టీలో వలస కార్మికుడిగా పని చేస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పని చేశారు. మధ్యాహ్నం భోజనం విరామం తర్వాత కనపడకపోవ డంతో తోటి కార్మికులు వెతికారు. సమీపంలోని వంకలో చెట్టుకు తన తల పాగాతో ఉరి వేసుకున్నారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని కిందకు దించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికీ తరలించారు. దుర్యోధన్ భార్య భానుమతి బెహరాకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఆయనకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


మృతి చెందిన దుర్యోధన్ బెహరా

చికిత్స పొందుతూ మృతి

బనగానపల్లె, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన బిల్ కలెక్టర్ పుష్పావతి పుల్లయ్య(62) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. పుల్లయ్య పలుకూరు మేజర్ గ్రామ పంచాయతీలో బిల్ కలెక్టరుగా కాంట్రాక్ట్ బేసిస్ మీద పని చేస్తున్నారు. అప్పులు అధికం కావడం తాగుడుకు బానిసై ఉద్యోగ జీతం సరిపోలేదని మనస్తాపం చెంది పలుకూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం రాత్రి పురుగుల మందు తాగారు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. పుల్లయ్య కుమారుడు సురేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

పత్తికొండ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురువలదొడ్డి గ్రామానికి చెందిన దంపతులు బాలకృష్ణ, మహేశ్వరి ఆత్మహత్యాయత్నం చేశారు. భార్యాభర్తలిద్దరూ మంగళవారం పొలానికి వెళ్లారు. పొలం వద్ద బాలకృష్ణ పురుగుల మందు తాగి అచేతనంగా పడి ఉండడంతో బంధువులు గుర్తించి పత్తికొండ ఆసుపత్రికి తరలించారు. భార్య ఇంటి వద్ద లేకపోవడంతో గాలింపు చేపట్టారు. అయితే పత్తికొండ చెరువు సమీపంలో కొళాయి బావి వద్ద ఆమె కూడా పరుగుల మందు తాగి అచేతనంగా పడి ఉన్నారు. ఆమెను కూడా పత్తికొండ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలుష్య నియంత్రణ పనులకు ఆమోదం

కర్నూలు కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సీఏపీ) కింద కర్నూలు నగరంలో రూ.7.87 కోట్లతో కాలుష్య నియంత్రణకు వీలుగా అభివృద్ధి పనులకు కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆమోదం తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కాలుష్య నియంత్రణలో భాగంగా నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సీఏపీ) కు సంబంధించి జిల్లాస్థాయి అమలు కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణలో భాగంగా కర్నూలు నగరంలో గాలి నాణ్యత పెంచేందుకు వీలుగా పలు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కిడ్స్ వరల్డ్ నుంచి రాజ్‌విహార్ బస్టాప్ దాకా ఉన్న రోడ్లకు ఇరువైపులా డస్ట్ లేకుండా మొత్తం తారురోడ్డు వేయాలని (ఎండ్ టూ ఎండ్ పేయింగ్ ఆఫ్ రోడ్స్) ఆదేశించారు. సీ.క్యాంపు నుంచి విజ్ఞాన్ మందిర్ వరకు విశ్వేశ్వరయ్య సర్కిల్ నుంచి రైతుబజారు వరకు, విజ్ఞాన్ మందిర్ నుంచి బీ.క్యాంపు ఆటో స్టాండు వరకు కూడా ఇదే విధంగా రోడ్లకు ఇరువైపులా డస్ట్ లేకుండా మొత్తం తారురోడ్డు వేయాలని ఆదేశించారు. అదే విధంగా ఉల్చాల జంక్షన్ నుంచి పెద్దపాడు వరకు ప్లాంటేషన్ చేపట్టాలని, కిసాన్‌నగర్ పార్కులో పచ్చదనం పెంచాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ పి.వెంకట కిషోర్ రెడ్డి, డీటీసీ శాంత కుమారి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల భర్తీ నోటిఫికేషన్ రద్దు

కర్నూలు హాస్పిటల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఫిబ్రవరిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల భర్తీ కోసం విడుదల చేసిన నోటిఫికేషన్ రద్దు చేసినట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి. నిర్మల ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నోటిఫికేషన్‌ను పరిపాలన కారణాల వల్ల రద్దు చేసినట్లు తెలిపారు.

సీజ్ చేసిన ఇసుకకు అనుమతులు

- కాంట్రాక్టర్‌తో వీఆర్వో కుమ్మక్కు
- అనుమతి లేకుండా వాడకం
- వీఆర్వోపై అనుమానాలు
- అక్రమంగా ఇసుకను నిల్వ చేసింది ఎవరు ?


కర్నూలు - బళ్లారి ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇసుక డంపు

కోడుమూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇసుక ఉచితం అని ప్రకటించగానే అవసరం ఉన్నా లేకున్నా ఇసుక అక్రమార్కులు కోడుమూరులోని హంద్రీ నది లోంచి ఇసుకను తరలించి ఎక్కడ పడితే అక్కడ ఇసుకను డంప్ చేసి పెట్టారు. దీనిపై గత ఏడాది డిసెంబరు 5న ఇసుక మస్కా అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం అయింది. పట్టణం లోని బీఎస్ఎన్ఎల్ ఆఫీసు సమీపంలో అక్రమ ఇసుక నిల్వను ఉన్నట్లు పోలీసులు గుర్తించి టన్నుల కొద్ది ఉన్న ఇసుక నిల్వను సీజ్ చేసి, రెవెన్యూ అధికారులకు అప్పగించారు. రెవెన్యూ సమక్షంలో ఉన్న ఇసుక ఎలాంటి అనుమతులు లేకుండా ఒక కాంట్రాక్టర్ రోడ్డు కల్వర్టు పనులకు ఉపయోగించడం పట్ల పలు అనుమానాలు వస్తున్నాయి. ఒక వీఆర్వో కాంట్రాక్టర్‌తో కుమ్మకై ఇసుక అనుమతులు ఇచ్చినట్లు తెలిసింది. పోలీసులు మూడు ఇసుక డంపులను సీజ్ చేయాలని మైనింగ్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇసుక డంపులను అంచనా వేసేం దుకు వచ్చిన మైనింగ్ అధికారులను తప్పుదోవ పట్టించిన వీఆర్వో రెండు డంపులను మాత్రమే సీజ్ చేయించినట్లు తెలిసింది. సదరు వీఆర్వో మైనింగ్ అధికారులనే కాకుండా పోలీసులు, తహసీల్దార్ బురిడీ కొట్టించాడన్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని కర్నూలు, బళ్లారి రోడ్డు ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఇసుక డంపును సీజ్ చేయించకుండా ప్రజలకు కనిపించని రెండు ఇసుక డంప్‌లను సీజ్ చేయించినట్లు తెలిసింది. ఇందు కోసం కాంట్రాక్టర్ నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు అందుకొన్నాడనే ఆరోపణలు ఉన్నాయి. సీజ్ చేసిన ఇసుక వాడకం అనుమతులపై ఇదేమిటని సదరు వీఆర్వోను ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు ఇసుక డంపులను మాత్రమే సీజ్ చేశామని, మూడో ఇసుక డంపును సీజ్ చేయలేదని జవాబు ఇచ్చారు. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి సదరు వీఆర్వోపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. గతంలో కూడా సదరు వీఆర్వోపై పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ నాయకుల అండ ఉందని ఈయన అవినీతికి అంతులేదనే విమర్శలు వచ్చాయి.

ఇసుక అక్రమ నిల్వ చేసింది ఎవరు ?


అధికారులు ఎంతసేపు అక్రమంగా డంపు చేసిన ఇసుకను సీజ్ చేసేందుకు ఆసక్తి చూపించారేగాని ఇంతకూ ఇసుకను నిల్వలు చేసింది ఎవ్వరు ? అనే దాన్ని పట్టించుకోలేదు. దీని పట్ల పలు అనుమానాలు ఉన్నాయి. అక్రమంగా హంద్రీనదిలోంచి ఇసుక డంపు చేసిన వాళ్లపై ఎందుకు కేసులు నమోదు చేయలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

విచారిస్తాం

సీజ్ చేసిన ఇసుకను వాడుకోవడానికి ఎవ్వరికీ అనుమతి ఇవ్వలేదు. అలాగే మరో ఇసుక డంపును ఎందుకు సీజ్ చేయలేదో విచారిస్తాం. - **రామాంజనేయులు, డీటీ, కోడుమూరు.**

ఏపీఈఆర్‌సీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ

- వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్ఈ యం. ఉమాపతి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్ఈ యం. ఉమాపతి

కల్లూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఏపీఈఆర్‌సీ ఆధ్వర్యంలో విజయవాడలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. మంగళవారం కర్నూలు విద్యుత్‌భవన్‌లోని సమావేశ మందిరంలో చేపట్టిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ యం. ఉమాపతి, కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ టి. శేషాద్రి పాల్గొన్నారు. విజయవాడలో నిర్వహించిన బహిరంగ, వీడియో కాన్ఫరెన్స్‌లో పలువురు హాజరై అభ్యంతరాలను తెలియపరిచారు. బుధవారం కూడా విజయవాడలో విద్యుత్ టారిఫ్‌పై ప్రజల అభిప్రాయాలు, సూచనలను తెలుసుకుంటారు. అదేవిధంగా ఈనెల 10న కర్నూలులోని ఏపీఈఆర్‌సీ భవన్‌లో విద్యుత్ టారిఫ్‌పై నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు సూచనలు, సలహాలు, అభ్యంతరాలను తెలియజేయాలని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ యం.ఉమాపతి తెలిపారు. టెక్నికల్ ఈఈ ఓబులేసు, ఏడీఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి

- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సూచించారు. బనగానపల్లె పట్టణంలోని మంత్రి బీసీ క్యాంపు కార్యాలయంలో మంగళవారం జడ్పీ సీఈవో నాసరరెడ్డితో పాటు పలువురు అధికారులు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా అభివృద్ధిపై చర్చించారు. మంత్రిని కలసిన వారిలో జిల్లా అటవీశాఖ అధికారులు ఉన్నారు. బేతంచెర్ల మండలం ఘన మద్దిలేటిస్వామి ఆలయం సిబ్బంది, ఆలయ ఈవోలు కలిసి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి తీర్థ ప్రసాదాలు అందించారు. అలాగే సెంట్రల్ పవర్ గ్రిడ్ గుత్తి డివిజన్ డీజీఎం, జీఎంలు, జిల్లా సమగ్రశిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమంత్ కుమార్, కర్నూలు జిల్లా ప్రాంతీయ అగ్నిమాపక అధికారి ఎం.భూపాల్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి మంత్రిని కలిశారు.


మంత్రి బీసీతో జడ్పీ సీఈవో నాసరరెడ్డి

మోదీ గో బ్యాక్

- వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలి
- సీపీఎం ర్యాలీ, ధర్నా




నగరంలోని కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్టని ప్రధాన మంత్రి మోదీ గో బ్యాక్ అంటూ సీపీఎం నాయకులు వ్యతిరేకించారు. రాష్ట్ర అభివృద్ధి పట్టని మోదీ పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం నగర కార్యదర్శి రాజశేఖర్ అధ్యక్షతన జిల్లా పరిషత్ ఆవరణ నుంచి రాజవిహార్, మెడికల్ కాలేజీ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ర్యాలీలో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, విభజన హామీలు అమలు చేయాలి, వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలి.. అంటూ నినాదాలు చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి. గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం పేరుతో రాష్ట్రానికి రాబోతున్న నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజానీకానికి సమాధానం చెప్పాలన్నారు. 2014 ఎన్నికల ముందు విభజన హామీలను అమలు చేస్తామని బాబు, మోదీ అధికారాన్ని కైవసం చేసుకున్నారని, విస్మరించారని ఆరోపించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలన్నారు.జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి. నిర్మల, టి. రాముడు, పీఎస్. రాధాక్రిష్ణ, జి. రామక్రిష్ణ, కె. వెంకటేశ్వర్లు, కేవీ. నారాయణ, గురుశేఖర్ పాల్గొన్నారు.

మూడేళ్లలో పెరిగిన జడ్పీ ఆదాయం

చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



కర్నూలు న్యూసిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పాలక వర్గం ఏర్పడిన మూడేళ్లలో జిల్లా పరిషత్ ఆదాయాన్ని అమాంతం పెంచినట్లు చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసి మూడేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం జడ్పీ కార్యాలయం లోని చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక స్టాండింగ్, సర్వసభ్య సమావేశాలు అర్థవంతంగా జరుగు తున్నాయన్నారు. సభ్యుల ప్రశ్నలకు అధికారులు సమా ధానాలు చెబుతున్నారని అన్నారు. ప్రధానంగా ఆర్‌డబ్ల్యూ ఎస్, వ్యవసాయం, గృహ నిర్మాణ శాఖలను మాత్రమే సమావేశాల్లో అజెండాగా చేరుస్తున్నామన్నారు. 2014-2019 వరకు జడ్పీ ఆదాయం కేవలం రూ.5 కోట్లు ఉందని, 2022-2025 వరకు కేవలం మూడేళ్లలో రూ44 కోట్లు పెంచామన్నారు. అధికారుల సహకారంతోనే నిధులు రాబడుతున్నామని చైర్మన్ తెలిపారు. జిల్లా పరిషత్ పాత భవనాన్ని టూరిజానికి అప్పగించడంతో పాటు పురాతన భవనాలను కాపాడుతున్నామని అన్నారు. సాధారణ నిధులకు మే వరకు పెండింగ్ బిల్లులు మంజూరు అయ్యాయన్నారు. జూన్ నుంచి ఇంకా రూ.7కోట్లు పెండింగ్ బిల్లులు ఉన్నాయన్నారు. జడ్పీటీసీ, ఎంపీపీల వేతనాలు జూన్ నుంచి డిసెంబరు వరకు సుమారు రూ.29 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. జిల్లాలో రిజర్వాయర్లు నిర్మిస్తే తాగు, సాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. ఆ దిశగా ప్రజాప్రతినిధులు ప్రభుత్వంతో చర్చించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జుపాడుబంగ్లా, గూడూరు జడ్పీటీసీలు పోచా జగదీశ్వరరెడ్డి, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 122 అర్జీలు

కర్నూలు కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం 13 గ్రామాల్లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 122 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని ఎమ్మిగనూరు మండలంలోని టీఎస్ కల్లూరు గ్రామంలో 6, కోసిగి మండలం కోసిగిలో 13, కౌతాళం మండలంలోని కామవరంలో 24, మంత్రాలయం మండలం వగరూరులో 3, పెద్దకడుబూరు మండలం పెద్దకడుబూరులో 18, ఆదోని మండలం జి. హోసలిలో 12, గనేకల్లులో 6, హొళగుంద మండలం పెద్దగోనేహాల్‌లో 13, కోసిగి మండలం పెండేకల్‌లో 4, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని కల్లూరు మండలం తడకనపల్లిలో 8, కర్నూలు రూరల్‌లోని సుంకేసులలో 7, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని ఆలూరు మండలం పెద్దహోతూరులో 5, ఆస్పరి మండలం ముత్తుకూరులో 3 అర్జీలు వచ్చాయన్నారు. బుధవారం 11 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని తెలిపారు.

పకడ్బందీగా జీఎన్ఎం పరీక్షలు

కర్నూలు హాస్పిటల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల జీఎన్ఎం నర్సింగ్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలో పరీక్షలను తనిఖీ చేశారు. ప్రతి కేంద్రానికి ఒక వైద్యాధికారిని నియమించామన్నారు. కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాపీలపై ఫిర్యాదులు వస్తున్నాయని, పరీక్షలు పారదర్శకంగా నిర్వహించ డానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తనిఖీ అధికారిగా డా.కిరణ్ కుమార్‌ను నియమించామన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద కాపీ చీటీలు..

పరీక్ష కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు విమర్శలు వెలువెత్తుతున్నాయి. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా జీఎన్ఎం కాలేజీ యజమానులు ఒక్కో విద్యార్థి నుంచి రూ.7వేలకు పైగానే వసూలు చేసినట్లు సూపరింటెండెంట్‌కు ఫిర్యాదులు వచ్చాయి. ఇక పరీక్ష కేంద్రాల బయట మైక్రో జిరాక్స్ పేపర్లు కుప్పలు కుప్పలుగా పడి ఉండటం, కాపీయింగ్‌కు కొందరు ఇన్విజిలేటర్లు సహకరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఓ క్లర్కుకు అనుకూలంగా కొందరు ఇన్విజిలేటర్లు పని చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.


పరీక్ష కేంద్రం వద్ద పడి ఉన్న మైక్రో జిరాక్స్ చీటీలు

మళ్లీ వైరస్ టెన్షన్..

- సీఎం టెలీ కాన్ఫరెన్స్
- జీజీహెచ్‌లో 20 పడకలతో ప్రత్యేక వార్డు


హెచ్‌ఎంపీవీ వైరస్ వార్డును ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ పుట్టిన చైనా నుంచి మరో మహమ్మారి వ్యాప్తి చెందుతుండటంతో సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతున్నది. కొద్ది రోజులుగా చైనాలో హ్యూమన్ మెటన్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) వ్యాప్తి చెందుతోంది. మన దేశంలో కూడా హెచ్‌ఎంపీవీ వైరస్ కేసులు వెలుగు చూడటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్ గైనిక్ విభాగంలో 20 పడకల హెచ్‌ఎంపీవీ వైరస్ విభాగాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు, వైద్య పరికరాలు, సిబ్బంది అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కేసుల దృష్ట్యా ఆసుపత్రిలోని హెచ్‌ఎంపీవీ వైరస్‌ను ఎదుర్కోడానికి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆసుపత్రిలో ఎలాంటి హెచ్‌ఎంపీవీ వైరస్ కేసు నమోదు కాలేదన్నారు. ఫల్మనాలజీ, అనస్థీషియా, మెడిసిన్, మైక్రో బయాలజీ ఎస్‌పీఎం, పీడియాట్రిక్ వైద్యులు అందు బాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్లు డా.కే. సీతారామయ్య, డా.డి. శ్రీరాములు, సీఎస్ఆర్ఎంవో డా.బీవీ రావు, వైస్ ప్రిన్సిపాల్ డా. రేణుకాదేవి, ఫల్మనాలజీ హెచ్‌వోడీ డా.శ్రీకాం త్, అనెస్థీషియా ప్రొఫెసర్ డా.శ్రీకాంత్, మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆరుగురు వైద్యులతో ఎక్స్‌పర్ట్ కమిటీ :

- మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డా. రేణుకాదేవి
- ఎస్‌పీఎం విభాగాధిపతి డా. సుధాకుమారి
- పీడియాట్రిక్ హెచ్‌వోడీ డా. విజయానంద్‌బాబు
- జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ డా. ఇక్బాల్ హుశేన్
- పల్మనాలజీ మెడిసిన్ హెచ్‌వోడీ డా. శ్రీకాంత్
- అనస్థీషియా హెచ్‌వోడీ డా.విశాలను

నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఊరూరా బెల్టు షాపులు!



- అధిక ధరలకు మద్యం విక్రయాలు
- బెల్టు షాపులు అడ్డుకునేదెవరు?
- అంతా అధికార పార్టీ కనుసన్నల్లో
- ముఖ్యమంత్రి ఆదేశాలు బేఖాతర్
- కనిపించని ఎక్సైజ్‌శాఖ దాడులు

కోడుమూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కోడుమూరు మండలంలో ఊరూరా బెల్టు షాపులు వెలిశాయి. మండల కేంద్రంలోని 5 మద్యం దుకాణాలు ఉన్నాయి. ప్రతి గ్రామానికి మండల కేంద్రంలోని ఐదు మద్యం షాపుల నుంచి మద్యం సీసాలు సరాఫరా చేస్తున్నారు. దీంతో ప్రతి గ్రామంలోని రెండు మూడు బెల్టు షాపులు వెలిశాయి. బెల్టు షాపులో క్వాటర్ సీసాపై 30శాతం, బీరుపై రూ.50 నుంచి రూ.60వరకు అధికంగా వసూళ్లు చేస్తున్నారని మందుబాబులు వాపోతున్నారు. బెల్టు షాపులు పెడినట్టు తెలిస్తే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అయితే ఉన్నతాధికారుల మెప్పు కోసం ముఖ్యమంత్రి ఆదేశాలను బేఖాతర్ చేసి బెల్టు షాపుల వైపు ఎక్సైజ్ శాఖ అధికారులు కన్నెత్తి చూడని చూడటం లేదు. ఎంత తాగిన్తే ఉన్నత అధికారుల దగ్గర అంత పేరు ఉంటుందని కోడుమూరు ఎక్సైజ్ పోలీసులు వ్యవహరిస్తున్నారు. రోడ్లు, ఇళ్ల మధ్య ఎక్కడ పడితే అక్కడ మద్యం అమ్మకాలు కొనసాగిస్తూ ప్రజలకు ఇబ్బంది కల్గిస్తున్నారు. అయినప్పటికీ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు తమకు సంబంధం లేదని గ్రామాల వైపు తొంగి చూడకపోవడం పట్ల ప్రజలు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు బెల్టు షాపులకు అధికార పార్టీ నేతల అండ దండలతోనే గ్రామాల్లో విచ్చల విడిగా బెల్టు షాపులు వెలిశాయి. ప్రభుత్వం మారినా మద్యం అమ్మకాల్లో మాత్రం నేతలు మారడం లేదని, మద్యం వ్యాపారంలో వైసీపీ, టీడీపీ ప్రభుత్వానికి తేడా లేదని ప్రజలు టీడీపీ నేతలు, పోలీ సులు, ఎక్సైజ్‌శాఖ అధికారులపై దుమ్మెత్తి పోస్తున్నారు.



24 గంటలు మద్యం అమ్మకాలు

కోడుమూరు మండలంలోని గోరంట్ల, పులకుర్తి, వర్కూరు, వెంకటగిరి, అమడగుంట్ల, ముడుమలగుర్తి, లద్దగిరి, అనుగొండ, కల్లపరి, ప్యాలకుర్తి, ఎర్రదొడ్డి ఆయా గ్రామాల్లోని బెల్టు షాపుల్లో రాత్రి పగలు తేడా లేకుండా 24 గంటలు మద్యం విక్రయాలు కొనసాగుతు న్నారు. ఇళ్ల మధ్యలోనే మందుబాబులకు తాగేందుకు సిట్టింగ్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నారు.

నేతల కనుసన్నల్లోనే మద్యం విక్రయాలు

కోడుమూరు పట్టణంలోని 5 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇం దులో అధికార పార్టీకి చెందిన నేతలు భాగస్వామ్యం ఉండటంతో వాళ్ల కనుసన్నల్లోనే మద్యం విక్రయాలు జోరుగా సాగిస్తున్నారు. వైన్‌షాపుల దగ్గర రూంలను ఏర్పాటు చేసి మందుబాబులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. గ్రామాల్లోని బెల్టుషాపులకు పోటీ పడి మద్యం సరఫరా చేస్తున్నారు.

డీజీపీ మా బ్రదర్...
పోలీసులకు చుక్కలు చూపిస్తున్న మంత్రి అనుచరుడు

కోడుమూరు పట్టణంలోని ఒక వైన్ షాపు యజమాని బెదిరింపులకు హద్దు లేకుండాపోయింది. పోలీసులు తన మద్యం దుకాణం దగ్గరకు రాకూడదని ఆంక్షలు విధించాడు. తాను రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అనుచరుడిని అని చెప్పుకుంటూ ఆయన చేస్తున్న హంగామా ఇంతా అంత కాదు. ఇటీవల కాలంలో ఆ మద్యం పరిసర ప్రాంతా ల్లో మందు బాబులు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తుంటే అటు వైపుగా పోలీసులు వెళ్లడంతో మంత్రి అనుచరుడు పోలీసులపై విరుచుకప డ్డాడు. డీజీపీ ద్వారకా తిరుమలరావు తమ బ్రదర్ అని, మీరు ఇటు వైపు వస్తే మా బ్రదర్‌కు ఫిర్యాదు చేస్తానని బెదిరించడంలో పోలీసులు ఏమీ చేయ లేక అక్కడి నుంచి జారుకున్నట్లు సమా చారం. మంత్రి అనుచరుడిని, డీజీపీ బ్రద ర్‌ను అంటూ పోలీసులకు చుక్కలు చూపిస్తున్నాడు. పోలీసులను లెక్క చేయని మంత్రి అనుచరుడిపై ఇప్పటికైనా పోలీసు, ఎక్సైజ్ ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవా ల్సి ఉంది.

దాడులు చేస్తాం.. పట్టుకుంటాం



బెల్టుషాపు ఉన్నట్లు ఫిర్యాదులు వస్తే దాడులు చేసి పట్టుకుంటాం. ప్రభుత్వం పర్మిట్ రూంలకు అనుమతులు ఇవ్వలేదు. వీటిపై కూడా ఫిర్యాదులు వస్తే తప్పకుండా చర్యలు తీసుకొంటాము.

- ఎం.మంజుల, ఎక్సైజ్ సీఐ, కోడుమూరు

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, అంగన్‌వాడీలు

కర్నూలు హస్పిటల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ, ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌లో స్కీం వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని తీర్మాణం చేసిన ఎందుకు అమలు చేయడం లేదని వారు ప్రశ్నించారు. తక్షణమే స్కీం కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్మికులకు జీతాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

ఓర్వకల్లు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులోని జయరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంటులో పని చేస్తున్న కార్మికులకు జీతాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఓర్వకల్లులోని జయరాజ్ ఇస్పాత్ పరిశ్రమ ఎదురుగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి నాగన్న తోపాటు సీఐటీయూ మండల నాయకులు సుధాకర్ హాజర య్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమలో ఏడు రోజులు గడిచినా జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఓర్వ కల్లు నుంచి పరిశ్రమ వద్దకు వెళ్లడానికి వాహనాలు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

విద్యార్థినులకు ప్రతిభా పురస్కారాలు



చెక్కులు పంపిణీ చేస్తున్న బ్యాంకు అధికారులు

ఓర్వకల్లు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమయాజులపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలిక విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. విద్యార్థినులు లిఖిత, మధులత, పరిమళలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున హుశేనాపురం ఆంధ్రప్రగతి గ్రామీ ణ బ్యాంకు మేనేజర్ శివకృష్ణ మంగళవారం అందజేశారు. బ్యాంకు మేనేజర్ శివకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు విలువతో కూడిన విద్యను అభ్యసించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లిల్లి పుష్పరాణి, విద్యాకమిటీ చైర్మన్ ఆకుల శ్రీనివాసులు, గ్రామ పెద్దలు ఆకుల మహేష్, కాకి దేవేంద్ర, రామమద్దిలేటి, నాగమల్లేష్, ఉపాధ్యాయులు కేవీ రమణ, రాజశేఖర్, సుభాషిణి, శైలజ, నిర్మలా దేవి, భారతి, యోగేశ్వరుడు, తిప్పన్న, సుశీలమ్మ, పరిమళసాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సి.బెళగల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులపై నిర్లక్ష్యం వహిస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని ఉపాధి పథకం కమిషనర్ స్వర్ణలత సిబ్బందిని హెచ్చరించారు. మంగవాళం ఎంపీడీవో కార్యాలయంలో ఆమె ఉపాధి సిబ్బంది వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా స్వర్ణలత మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు కోసం ప్రవేశపెట్టిన పథకాలపై నిర్లక్ష్యం వహించొద్దన్నారు. అలాగే జాబుకార్డుల మంజూరులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసమావేశంలో ఎంపీడీవో రాణెమ్మ, ఏపీవో రామన్న, ఈసీ రంగస్వామి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిపై ఎంపీడీవో ఆగ్రహం

సి.బెళగల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని ఒకటో, రెండో సచివాలయాలో పనిచేస్తున్న సిబ్బంది మంగళవారం 12 గంటలైనా కార్యాలయాను తెరువకపోవడంతో సచివాలయాల సిబ్బందిపై ఎంపీడీవో రాణెమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. వృద్ధులు, వికలాంగులు, రైతులు, విద్యార్థులు పలురకాల సర్టిఫికెట్ల కోసం సచివాలయం దగ్గర వేచి చూస్తున్న వారితో ఎంపీడీవో మాట్లాడారు. సచివాలయ సిబ్బందికి ఫోన్ చేసి ఎక్కడ ఉన్నారని అడిగితే బస్సులు లేటు అయిందని, ఫీల్డులో ఉన్నామని మరికొందరు చెప్పారు. విధులకు డుమ్మా కొట్టిన వారందరికీ రిజిస్ట్రర్‌లో అప్‌సెంటు వేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

పాఠశాల తనిఖీ

గూడూరు, జనవరి 7: గూడూరులోని ఏబీఎం ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారులు సునీలమ్మ, నాగరాజు మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు ఎంత మంది ఉన్నారు, హాజరు ఎంత మంది అయ్యారు అని పరిశీలించారు. మొత్తం విద్యార్థులు 56మంది ఉన్నారని అందులో 34మంది విద్యార్థు లు హాజరైనట్లు ఎంఈవో సునీలమ్మ తెలిపారు.



పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు

భక్తిశ్రద్ధలతో స్వామి అమ్మవార్ల శోభాయాత్ర

కర్నూలు కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బళ్లారి రోడ్డు సమీపంలోని వాసవీనగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో కొనసాగు తున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మ వార్ల ఉత్సవమూర్తులకు శోభాయాత్ర నిర్వహించారు. ఆదిశేష వాహ నంపై వేంకటేశ్వర స్వామి, గోదా దేవి, రంగనాథ స్వామి వార్లను అలంకరింపజేసి ఈ శోభాయాత్ర చేపట్టారు. అంతకు ముందు స్వామి, అమ్మ వార్లకు అభిషేకాలు, అర్చనాలు చేశారు. తిరుప్పావై పాశురాల పఠనం, లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్రాలు, విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. కార్యక్రమంలో యాలిశెట్టి భద్రయ్య శెట్టి కుటుంబ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం మహిళా భక్తులతో దీపోత్సవం ఉంటుందని, ఈనెల 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా రాత్రి ఒంటి గంటకు మూల మూర్తికి క్షీరాభిషేకం, తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం, 11న కుడారై సేవ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళా భక్తులు

కోయిల్ ఆళ్వా తిరుమంజనం సేవలో మల్లెల

ఓర్వకల్లు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వా తిరుమంజనం (ఆలయ శుద్ధి) సేవలో ఆలయ చైర్మన్‌తోపాటు టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ పాల్గొన్నారు. ఆలయ శుద్ధిని అర్చకులు నిర్వహించారు. అనంతరం సుగంధ ద్రవ్యాలు కలిగిన పవిత్ర జలాన్ని ఆలయం అంతా సంప్రోక్షణం చేశారు.



తిరుపతిలోని శ్రీవారి ఆలయానికి నీటితో శుభ్రం చేస్తున్న మల్లెల రాజశేఖర్

సీఏలో సుస్మిత

భర్త, అత్తమామల ప్రోత్సాహం



కోడుమూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరని కోడుమూరుకు చెందిన సజ్జన గాండ్ల సుస్మిత నిరూపించారు. ఇటీవల విడుదలైన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా పరీక్ష ఫలితాల్లో ఎస్‌జీ సుస్మిత చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ)గా ఉత్తీర్ణత సాధించి సత్తా చాటింది. 2022లో వివాహమై ఒక పాప ఉన్న సుస్మిత.. భర్త అత్తమామల ప్రోత్సాహంతో ఈ విజయం సాధించానని అన్నారు.

కురుబలకు రుణాలు అందించాలి

కర్నూలు కలెక్టరేట్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆర్థిక సంవ త్సరం నుంచి కార్పొరేషన్ ద్వారా కురుబ, కురుమ కులస్థులకు రుణాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీ రాష్ట్ర కురుబ కురుమ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, రాష్ట్ర డైరెక్టర్ కె.రామకృష్ణలు రాష్ట్ర బీసీ వెల్ఫేర్ డైరెక్టర్, కార్పొరేషన్ ఎండీ మల్లికార్జున కోరారు. మంగళవారం విజయవాడలో బీసీ కార్పొరేషన్ కార్యాలయంలోని కురుబ, కురుమ కులస్థులు పథకాల గురించి ఎండీతో చర్చించారు. ఈ మేరకు కర్ణా టక, ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న పథకాల గురించి అధ్యయనం చేయాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేసేందుకు చర్యలు చేపడుతామని ఎండీ హామీ ఇచ్చారని తెలిపారు.



రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ ఎండీతో మాట్లాడుతున్న రామకృష్ణ

సుంకేసులలో రెవెన్యూ సదస్సు

కర్నూలు రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కర్నూలు రూరల్ మండలంలోని సుంకేసుల గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసదస్సుకు మండల డిప్యూటీ తహసీల్దార్ శివప్రసాద్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో మొత్తం ఏడు అర్జీలు వచ్చాయని, అందులో భూ ముల మ్యూటేషన్, సర్వేలు చేయించాలని రైతులు అర్జీలు పెట్టుకు న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు కురువ గిడ్డమ్మ, ఇన్‌చార్జి వీఆర్వో బి.రామాంజనేయులు, సర్వేయరు శివ పాల్గొన్నారు.

ఆధార్ సేవలు వినియోగించుకోండి: ఎంపీడీవో

కోడుమూరు రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత ఆధార్ సేవలు వినియోగించుకోవాలని ఎంపీడీవో రాముడు కోరారు. మంగళవారం ఎంపీడీవో మాట్లాడుతూ పులకుర్తి, ప్యాలకుర్తి, గోరంట్ల గ్రామాల్లోని సచివాల యాల్లో నెలాఖరు వరకు ఆధార్ సేవలందుతాయని తెలిపారు. 0-6 ఏళ్ల లోపు పిల్లలకు సంబంధించి పుట్టిన తేదీ ధ్రువపత్రాలను సమర్పించాలన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సహకరిం చాలని సూచించారు.

కుష్ఠుపై అపోహాలు వద్దు

సి.బెళగల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): కుష్ఠుపై అపోహాలు వద్దని సూపర్‌వైజర్ శకుంతల అన్నారు. మంగవారం పోలకల్లు, సిబెళగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆశా వర్కర్లతో సమావేశం నిర్వ హించారు. హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలి

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో సెపక్‌తక్రాకు గుర్తింపు తీసుకురావాలి జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. మంగళవారం కర్నూలు జిల్లా ఆలూరులో పది రోజుల పాటు జరుగుతున్న జాతీయ స్థాయి సెపక్ తక్రా కోచిం గ్ క్యాంప్‌కు డీఎస్‌డీవో భూపతిరావు హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు పీడీ కవిరాజ్, సులోచన, చినబాబు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు పీఠాధిపతికి ఆహ్వానం



పీఠాధిపతికి ఆహ్వానపత్రిక ఇస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్ బాగ్‌లోగల హరిహర క్షేత్రంలో ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 8 వరకు నిర్వహించనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని ఉడిపి పెజావర్ పీఠాధిపతి విశ్వప్రసన్న తీర్థులకు నగర బ్రాహ్మణ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బి.క్యాంపులోని విజ్ఞాన మందిరంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సందేల్ చంద్రశే ఖర్ ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు పీఠాధిపతిని కలిసి, బ్రహ్మో త్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి హరిహర క్షేత్ర విశేషాలను, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. బ్రాహ్మణ సంఘ నాయకులకు ఆశీర్వదం అంద జేశారు. కార్యక్రమంలో టీవీ రవిచంద్రశర్మ, నాగులవరం రాజశేఖర్, కేవీ సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

సి.బెళగల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు సాధించవచ్చు అని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం అవరణలో ఈర్లదిన్నె, ముడుమాల గ్రామాల్లోని రైతులు ప్రకృతి వ్యవసాయంతో పండించిన కురగాయలు, పండ్లను విక్రయించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, నాగన్నలే ఆకుకూరలు, కురగాయలు సాగు చేయడంతో మంచి దిగుబడి వచ్చిందని తెలిపారు.

శ్మశాన వాటిక స్థలాల పరిశీలన

ఓర్వకల్లు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నన్నూరు గ్రామంలో ముస్లింలు, బీసీ కులాల సంఘాల అభ్యర్థన మేరకు మంగళవారం తహసీల్దార్ విద్యాసాగర్ నాయకులతో కలిసి శ్మశాన వాటిక స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ శ్మశాన వాటికకు స్థలాలు కేటాయించి ప్రహరీ, తాగు నీరు వసతులు కల్పించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసు కెళ్తామన్నారు. ఆమె వెంట టీడీపీ నాయకులు విశేశ్వరరెడ్డి, విజ యుడు, ఖాజామియా, చంద్రశేఖర్ రెడ్డి, షంషుద్దీన్, సర్దార్ ఖాన్, వడ్ల బాషా, కటిక హాసన్, అహ్మద్ బేగ్ ఉన్నారు.

ఆర్టీసీ పరిరక్షణ కోసం పోరాడుదాం

కర్నూలు న్యూసిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ పరిరక్షణకు పోరాడుదామని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి జే.దివాకర్ అన్నారు. మంగళవారం కేకే భవన్‌లో 2025 సంవత్సరం నూతన డైరీని ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, ఫెడరేషన్ రీజినల్ కార్యదర్శి రాయుడు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి: పేదలకు కూటమి ప్రభుత్వం ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామ క్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్న నిరాహారదీక్షలు మంగళవారం ఐదో రోజుకి చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పేదలకు ఇళ్లస్థలాలు, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, కార్యవర్గసభ్యుడు బీసన్న, నాయకులు సత్యం, రాజేశ్ పాల్గొన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం

కోడుమూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కోడుమూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టు బడిన సారా, మద్యం సీసాలు, ప్యాకెట్లను ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ధ్వంసం చేశారు. స్థానిక హంద్రీనది పాత బ్రిడ్జిపై ఏడు కేసుల్లో పట్టు 125 లీటర్ల నాటు సారా, 12 కేసుల్లో పట్టు 412 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ మంజుల, ఎస్ఐలు చంద్రమోహన్, శ్రీలక్ష్మీ, కానిస్టేబుళ్లు జగదీష్, సాయి కుమార్, నాగయ్య, భూలక్ష్మి, సుజాత, తిరుపాలయ్య పాల్గొన్నారు.



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర విద్యార్థి యువజన సంఘాల జేఏసీ నూతన సంవత్సర క్యాలెండర్-2025ను మంగళవారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం మాధవీనగర్‌లోని తన స్వగృహంలో జేఏసీ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని అన్నారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యస్వామి, ఏపీ నిరుద్యోగుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీరాములు, రాయలసీమ విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు కోనేటి వెంకటేశ్వర్లు, అడ్వకేట్ బి.నరసింహ రాజు, రాజన్న పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

కర్నూలు కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ సంతోషంగా జీవించాలని విశ్రాంత కలెక్టర్ రామ్‌శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో విశ్రాంత ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, 2025 నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్‌శంకర్ నాయక్ మాట్లాడుతూ వ్యాయామం, ధ్యానం, యోగ, మానసిక ప్రశాంతత, వైద్య పరీక్షలు వంటి ఐదు అంశాలను పాటిస్తూ ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. సంఘం అధ్యక్షుడు శంకరప్ప మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు మానసిక ప్రశాంతత అవసరమన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేజీ గంగాధరరెడ్డి, విశ్రాంత జిల్లా రెవెన్యూ అధికారి రఘునాథరెడ్డి, టీజీవీ కళానక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

కర్నూలు న్యూసిటీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గ్రామ పంచాయతీలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి అందరూ కృషి చేయాలని జిల్లా పరిషత్ విశ్రాంత సీఈఓ జైపాల్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ, డీఎల్‌పీఓలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం డీపీఆర్‌సీ భవనంలో విశ్రాంత సీఈఓ జైపాల్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ ప్రారంభించారు. డీపీఆర్‌సీలో జరిగిన శిక్షణలో గ్రామ పంచాయతీలలో సాధారణ పరిపాలన విధానం, పంచాయతీరాజ్ చట్టం 1994 ముఖ్య నిబంధనలు తదితర అంశాలపై శ్రీకాళహస్తిలో శిక్షణ తీసుకున్న టీఓటీలు ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీ, డీఎల్‌పీఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గాంధీ కలలు గన్న స్వరాజ్యం సిద్ధించాలంటే ముందుగా గ్రామాలు అభివృద్ధి చెందాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సామాజిక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని డీఎల్‌పీఓ నూర్జహాన్, ఎంపీడీఓలు రఘునాథ్, శ్రీనివాసులు, గీతావాణి, అల్లాబకాష్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని కళావాహిని సాంస్కృతిక, సాహితీ సంస్థ ఆధ్వర్యంలో దివంగత ప్రముఖ రంగస్థల సంగీత విద్వాంసుడు, నాటక దర్శకుడు కేసీ శివారెడ్డి 6వ వర్ధంతి సందర్భంగా టీజీవీ కళాక్షేత్రంలో ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు కళావాహిని సంస్థ అధ్యక్షుడు ఎం.మనోహర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 6.15 గంటలకు ఈ నాటక ప్రదర్శనలు ప్రారంభమవుతాయని, ఇందులో నారద, కర్ణ ఏకపాత్రాభినయాలు, శ్రీకృష్ణ (పడక సీను), చింతామణి (భవాని, చింతామణి సీను నుంచి ఉద్యానవన సీను వరకు) ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. నారదునిగా కళాప్రియ తిరుపాలు, కర్ణగా శీలం రోశన్న, శ్రీకృష్ణుడిగా కె. గజేంద్రనాథ్‌రెడ్డి, అర్జునుడిగా డీజే వినోద్‌కుమార్, చింతామణిగా ఆర్ శారదావాణి, బిల్వమంగళునిగా బీసీ కృష్ణ, భవానిగా ఆర్‌సీ లక్ష్మణరాజు నటిస్తారని తెలిపారు. ఈ నాటకాలకు సంగీతం యు రామలింగయ్య, సిండె ధనుంజయ, కేసీ లక్ష్మన్న అందిస్తారని, తబల ఎం.మారెన్న, పర్య వేక్షణ ఎం.చంద్రశేఖర్, దర్శకత్వం ఎం.మనోహర్‌బాబు వహిస్తారని ఆయన తెలిపారు.

చెస్ పోటీలకు ఆర్‌యూ జట్టు



పురుషుల జట్టుతో ఆర్‌యూ ఉపకులపతి ఎన్‌టీకే నాయక్

కర్నూలు స్పోర్ట్స్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల చెస్ పురుషుల పోటీలు ఈ నెల 8వ తేదీ నుంచి 13వ తేదీ వరకు చెన్నైలోని వెల్‌టెక్ విశ్వవిద్యాలయంలో జరగుతు న్నాయి. ఈ నేపథ్యంలో రాయలసీమ విశ్వవిద్యాలయం పురుషుల చెస్ జట్టు ఈ టోర్నమెంటులో పాల్గొంటుంది. మంగళవారం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో క్రీడాదుస్తుల పంపిణీ కార్యక్రమంలో ఆర్‌యూ ఉప కులపతి ఎన్‌టీకే నాయక్ పాల్గొని క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. అనంతరం జట్టు వివరాలు ప్రకటించారు. రంగ స్వామి, రమేష్ (ఆర్‌యూ కళాశాల, కర్నూలు), సమీర్ (సెయింట్ జోసెఫ్ డిగ్రీ కాలేజీ, కర్నూలు), వినోద్ కుమార్ (శ్రీసాయిక్రిష్ణ డిగ్రీ కాలేజీ, కర్నూలు), జశ్వంత్ (ఉస్మానియా డిగ్రీ కాలేజీ కర్నూలు), పవన్ కుమార్ (ఎస్‌ఆర్‌కే డిగ్రీ కాలేజీ, నంద్యాల)లను అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌యూ రిజిస్ట్రార్ బోయ విజయ్ కుమార్ నాయుడు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డా.కేవీ శివకిషోర్, జట్టు మేనేజర్ పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

టీడీపీలోనే కార్యకర్తల సంక్షేమం

ఆదోని టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి: పార్టీ కార్యకర్తల సంక్షేమంపై ప్రాధాన్యమివ్వడం టీడీపీలోనే కనిపిస్తుందని ఆ పార్టీ మాజీ కౌన్సిలర్లు బాలాజీ, శ్రీనివాస ఆచారి అన్నారు. మంగళవారం మాట్లాడుతూ, పార్టీపై నమ్మకంతో, సభ్యత్వం తీసుకొన్న కోటి మంది సభ్యులకయ్యే రూ.42కోట్ల ను మంత్రి నారా లోకేష్ బీమా కంపెనీలకు చెల్లించారన్నారు.

రేపు రథోత్సవం

పత్తికొండ టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ - హోసూరు రహదారిలో నరసింహస్వామి రథోత్సవాన్ని ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9గంటలకు పంచామృతాభిషేకం, రథాంగ హోమం, రథోత్సవ కలశ స్థాపనతో పాటు రాత్రి 9గంటలకు భజన ఉంటుందని, మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి రథోత్సవం ఉంటుందన్నారు.

సెపక్ తక్రా శిక్షణ ప్రారంభం



శిక్షణను ప్రారంభిస్తున్న క్రీడల శాఖ అధికారి భూపతి

ఆలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో జాతీయ స్థాయి సెపక్ తక్రా శిక్షణను మంగళవారం జిల్లా క్రీడల అధికారి భూపతి ప్రారంభించారు. క్రీడల్లో ప్రతిభ చూపి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలని కోరారు. శిక్షణ పదిరోజులు పాటు కొనసాగుతుందన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో పీడీలు కవిరాజ్, సులోచన, చిన్నబాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఐలాండ్‌ల ఏర్పాటుకు చర్యలు..

ఆదోని టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రద్దీగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీస్ ఐలాండ్లను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నారు. ఎంఈ ఇంతియాజ్ అలి మంగళవారం మాట్లాడుతూ రద్దీ ప్రాంతాలు కొత్త బస్‌స్టాండ్, పోలీస్ కంట్రోల్ రూమ్, భీమాస్ సర్కిల్, పాత ఫ్లైఓవర్ బ్రిడ్జి సర్కిల్ ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నామన్నారు.

పొలానికి పాసు పుస్తకాలు ఇవ్వండి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతు

తుగ్గలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తనకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని బొందిమడుగుల గ్రామ రైతు వీరేష్ కోరారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ సర్వేనెం.60లో 5.80 ఎకరాల పొలం తన తాత రామన్న నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాని, 17 ఏళ్లుగడిచాయని, అన్ని రికార్డులు సమర్పించినా పాసు పుస్తకాలు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన తహసీల్దార్ రమాదేవి రికార్డులు పరిశీలించి రైతుకు న్యాయం చేస్తామని తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

ఆలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శనివారం అదృశ్యమైంది. తల్లిదండ్రులు బంధువుల వద్ద అరాతీసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం ఆలూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మిగనూరు మండలం మల్కాపురం గ్రామానికి చెందిన విద్యార్థిని ఆలూరులో బంధువులు ఉండటంతో ఇక్కడే చదివిస్తున్నారు.. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు.

హైందవ శంఖారావం విజయవంతం

ఆదోని టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావం విజయవంతమైందని, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకార్ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు విట్టా రమేష్ అన్నారు.

ఎంపీడీవో కావలెను

- ఆలూరులో రెగ్యులర్ అధికారి లేక ఇబ్బందులు
- గాడి తప్పిన పాలన



ఆలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలానికి రెగ్యులర్ ఎంపీడీవోను నియమించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్నికలకు ముందు ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు పంపి తిరిగి వారిని యాథాస్థానాలకు నియమించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎంపీడీవో అల్లాబకాష్‌ను చిప్పగిరికి బదిలీ చేసి, ఆలూరుకు అమానుల్లాను నియమించారు. అయితే ఆయన బాధ్యతలు తీసుకోలేదదు. దీంతో సూపరింటెండెంట్ రమాదేవికి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. నెలకే తాను బాధ్యతలు నిర్వహించలేనని ఆమె ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో దేవనకొండ ఈవో ఆర్డీ సూర్యనారాయణను ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు. ఇక్కడ సిబ్బంది కొరత ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. సీనియర్ అసిస్టెంట్, టైపిస్ట్ పోస్ట్‌తో పాటు నలుగురు పంచాయతీ కార్యాదర్శుల పోస్టులు ఖాళీ ఉన్నాయి. దీంతో ఇక్కడ చేరేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

కలిసికట్టుగా పని చేద్దాం

- పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజినేయులుతో టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ చర్చ



ఎమ్మెల్యే రామాంజినేయులుతో టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

ఆలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆలూరు అభివృద్ధికి కలిసికట్టుగా పని చేద్దామని గుంటూరు జిల్లా పత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజినేయులు అన్నారు. మంగళవారం ఆలూరుకు వచ్చిన ఆయనను ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ కలిశారు. నియోజకవర్గంలో పెండింగ్ ఉన్న దీర్ఘకాలిక సమస్యలపై చర్చించారు. వేదవతి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు సీఎం దృష్టికి తీసుకెళదామని, పార్టీ పరిస్థితులపై, ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎంపికపై ప్రధానంగా చర్చించారు. నాయకులు, త్యాగరాజు, నారాయణ, నరసప్పా, కొమ్ము రామాంజినే యులు, కొమ్ము రాజు, ఈరన్న, రాము యాదవ్, గోపి, మసాలా జగన్, బోయ వీరేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ భవన్ అభివృద్ధికి సహకరించాలి

పట్టణంలో దళితుల సౌకర్యార్థం నిర్మించిన అంబేద్కర్ భవన్ అభివృద్ధికి సహరించాలని దళిత నాయకులు కొమ్ము రామాంజి నేయులు, పెయింటర్ గోవింద్, ఉలిగప్ప కోరారు. మంగళవారం ఆలూరుకు వచ్చిన పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజినేయులుకు వినతిపత్రం అందించారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ భవన్‌ను సచివాలయానికి కేటాయించిందని, నూతన భవనం నిర్మించినా ఖాళీ చేయడం లేదన్నారు. జడ్పీ సీఈవోతో మాట్లాడాలని, కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.కొట్టాల సర్పంచ్, డా రాజశేఖర్ నాయకులు, ఆంజనేయులు, రామంజి ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

ఆస్పరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాను అరికట్టి, చెరువులను కాపాడాలని సీపీఐ మండల కార్యదర్శి విరుపాక్షి డిమాండ్ చేశారు. మంగళవారం బస్టాండులో రాస్తారోకో నిర్వహించారు. వెంగలాయ దొడ్డి చెరువు పరివాహక ప్రాంతంలో ఇసుక తవ్వకాలను నిషేధించాలన్నారు. చెరువు మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉందని, చెరువు కింద కైరుప్పల, కారమంచి, కలపరి, చెన్నంపల్లి గ్రామాల ఆయకట్టు భూములు ఉన్నాయన్నారు. తొగలగళ్ళు సర్పంచ్ ఆంజనేయ, బీటెక్ వీరభద్ర, రమేష్, హను మంతు, రామాంజినేయులు పాల్గొన్నారు.

దుకాణాలను స్వాధీనం చేసుకుంటాం

ఆలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అద్దె చెల్లించకపోతే దుకాణాలను స్వాధీనం చేసుకుంటామని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి భూపతి హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని అరికేర రోడ్డులో ఉన్న ఇండోర్ స్టేడియం దుకాణదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు అద్దెలు రూ.10లక్షలు బకాయి ఉందన్నారు. కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారని బకాయిలు చెల్లించని పక్షంలో స్వాధీనం చేసుకుంటామని తెలిపారు.

కూటమితోనే అభివృద్ధి

మద్దికెర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని జనసేన నాయకుడు వైపీ క్రాంతి కుమార్ అన్నారు. వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న మంజునాథ్‌ను మంగళవారం సన్మానించారు.

బీజేపీ మండల అధ్యక్షుల ఎంపిక





బోయ మహదేవ్, నాగార్జున(ఫైల్)

ఆదోని టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు మండల అధ్యక్షులను ఎంపిక చేసినట్లు పార్టీ ఎన్నికల సహాయాధికారి దేశాయ్ చంద్రన్న మంగళవారం తెలిపారు. ప్రతి 50 బూత్‌లను ఒక మండలంగా కేంద్ర నాయకత్వం ప్రకటించిన నేపథ్యంలో నాయకులను ఎంపిక చేశామని తెలిపారు. ఆదోని టౌన్ నార్త్ మండలానికి బోయ మహదేవ్, ఆదోని టౌన్ సెంట్రల్ గోవి నాగార్జున, ఆదోని రూరల్ పెద్ద తుంబలం మండల కురువ వేణుగోపాల్, ఆదోని రూరల్ సాదాపురం బోయ ఉషారాజ్‌ను అధ్యక్షులుగా ఎంపిక చేశామని తెలిపారు. టౌన్ సౌత్ అధ్యక్షుడి పేరు ఉందని త్వరలోనే ప్రకటిస్తామని అన్నారు.

సచివాలయం తెరిచేదెన్నడు?



తాళం వేసిన సచివాలయం

ఆదోని టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 20వ వార్డు సాయిబాబ నగర్ సచివాలయానికి మంగళవారం 11:30 గంటలకే తాళం వేసేశారు. వివిధ పనుల మీద వచ్చిన వార్డు ప్రజలు ఇబ్బందులు నిరాశతో వెనుదిరిగారు. అసలు తెరిచారా, లేదా తెలియడం లేదని విశ్రాంత బ్యాంకు మేనేజర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



సీహెచ్‌వో భాగ్యలక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్లు

దేవనకొండ, జనవరి7(ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆశా వర్కర్లు నాయకులు రమీజాబీ, తులసి, రాధిక, రాధ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి, వినతిపత్రం ఇచ్చారు. ఉద్యోగులుగా గుర్తించాలని, 8 గంటల పనివిధానం అమలు చేయాలన్నారు. నాగవేణి, అనిత, హైమావతి, నిర్మల, కమలాక్షి, కృష్ణవేణి, విజయలక్ష్మి, రాజమ్మ, కాంతమ్మ, జైనబీ, సుజాత, లకి&ప్రసన్న, అనసూయ, సరోజ, అరుణజ్యోతి, మీన, వరలక్ష్మి, రామక్క, శివమ్మ పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి

వెల్దుర్తి, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డు ఉన్న వారందరికీ పనులు కల్పించాలని ఉపాధి హామి రాష్ట్ర కమిషనర్ గిరిజ శంకర్ ఆదేశించారు. మంగళవారం టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లతో వీడి యో కాన్ఫరెన్స్‌లో శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో సుహాసినమ్మ, ఏపీవో లక్ష్మన్న, ఈసీ పృథ్వీరాజు, సిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి

- కార్యదర్శి లక్ష్మినాథ్

వెల్దుర్తి టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నూతన గృహాలు నిర్మించుకోవాలనుకునే వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి లక్ష్మినాథ్ సూచించారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అందరి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం గ్రామంలోని 3 సచివా లయాలను తనిఖీ చేసి, సమావేశం నిర్వహించారు.

వ్యక్తిపై దాడి

ఆస్పరి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగరడోణ గ్రామంలో ఒకే సామాజిక వర్గానికి ఇద్దరు ఘర్షకు పాల్పడ్డారు. వివరాల మేరకు.. మంగళవారం మారెప్ప అనే వ్యక్తి డ్రైనేజీలోని పూడికను తొలగిస్తుండగా నల్లన్న అనే వ్యక్తి అడ్డుతగిలాడు. ఇంతకు ముందే ఇరువురికి మనస్పర్ధలు ఉన్నాయి. దీంతో మాటా మాటా పెరిగి దాడులకు తెగబడ్డారు. మల్లన్న వైపు కొందరు, మారెప్ప వైపు మరికొందరు కట్టెలతో దాడిచేసుకున్నారు. మారెప్పకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మస్తాన్ వలి తెలిపారు..

అవగాహన ఉండాలి

తుగ్గలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనులపై సిబ్బందికి అవగాహన ఉండాలని ఏపీవో హేమసుందర్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో నూతనంగా ఎంపికైన ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లకు ఉపాది కమిషనర్ టెలీ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు.

వాహనాలు ఢీ..

ముగ్గురికి గాయాలు





బోల్తాపడ్డ వాహనాలు

ఆలూరు, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురువల్లి గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున టిప్పర్, జైలో వాహనం ఢీ కొని బోల్తాపడ్డాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన మేరకు.. బళ్లారి నుంచి కేఏ 34 డీ 1053 నెంబరు గల టిప్పర్ రాయచూరు నుంచి బళ్ళారి వెళ్తుండగా ఎదురుగా మంత్రాలయం నుంచి బళ్ళారి వైపు వెళ్తున్న ఏపీ 21 బీజడ్ 0926 నెంబరు గల జైలో వాహనం ఢీ కొట్టి, రెండు వాహనాలు బోల్తా పడ్డాయి. టిప్పర్‌లో ఉన్న రాయదుర్గానికి చెందిన నారాయణ రెడ్డి, నరేంద్ర, మరో వాహనంలోని నందవరానికి చెందిన శేఖర్‌కు గాయాలు కాగా, ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు.

ఇష్టపడి చదవాలి

మద్దికెర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదవాలని ఎంఈవో రంగస్వామి సూచించారు. మంగళవారం మండలంలోని పెరవలి జడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్స్‌ను దాత రవికుమార్ సహకారంతో అందజేశారు. పుస్తకాలను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. పోటీతత్వం ఉంటే మంచి ప్రయోజకులు అవుతారన్నారు. హెచ్ఎం ఉమా, యూటీఎఫ్ నాయకులు ఎంజీ నాగరాజు, విశ్వనాథ్, అరుణ్ కుమార్, విద్యాకమిటి చైర్మన్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు మెడికల్ తిమ్మప్ప, మంగళ రంగస్వామి తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి కృషి చేయాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్పీవో

తుగ్గలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని డీఎల్‌పీవో వీరభద్రప్ప సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈవోఆర్డీ శ్రీహరి, సర్పంచులు ఓబులేసు, కార్యదర్శులు నారాయణ స్వామి, రాజు నాయక్, రామాంజనేయులు, కార్తీక్ రంగనాథ్ ఉన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వేగవంతం చేయాలి

చెత్త సంపద కేంద్రాల నిర్మాణాలను వేగవంతం చేయాలని డీఎల్పీవో సూచించారు. మండలంలోని జొన్నగిరిలో చెత్త సంపద కేంద్ర నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఈవోఆర్డీ శ్రీహరి, ఏపీవో హేమసుందర్, సర్పంచ్ ఓబులేసు, పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి తదితరులు ఉన్నారు.

ఆదోని వాసికి డాక్టరేట్



దుర్గేష్

ఆదోని అగ్రికల్చర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయి భారతి విద్యాసంస్థల అధినేత బి.దుర్గేష్‌కు హైదరాబాద్ జీఎస్‌హెచ్‌ఎస్ఈఏ అకాడమీ, స్ప్రింగ్ థియాలజీ యూనివర్సిటీ టెక్సాస్ గౌరవ డాక్టరేట్ ఇచ్చారు. మంగళవారం హైదరాబాదులో నిర్వహించిన స్నాతకోత్సవంలో డేస్ప్రింగ్ థియాలజీ యూనివర్సిటీ టెక్సాస్, యూఎస్ఏ గుడ్ న్యూస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ న్యూయార్క్, అమెరికా ప్రతినిధులు ఛాన్సలర్ డాక్టర్ స్టీవెన్, వైస్‌ఛాన్సలర్ మరియా కుమార్‌తో పాటు సినీ నటుడు పృథ్వీరాజ్ చేతుల మీదుగా అందుకున్నారు.

కులం సర్టిఫికెట్లపై విచారణ



విచారణ చేస్తున్న తహసీల్దార్

వెల్దుర్తి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): గతంలో జారీచేసిన మాదాసి కురువ కులం సర్టిఫికెట్లపై మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖరవర్మ, డీటీ గురుస్వామిరెడ్డి విచారణ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేస్తున్నామన్నారు. లక్ష్మీనగరం, బింగిదొడ్డి, సూదేపల్లె గ్రామాల్లో తహసీల్దార్, ఎస్.బోయనపల్లె, గోవర్ధనగిరి, శ్రీరంగాపురం గ్రామాలలో డీటీ విచారణ చేశారు.

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

మద్దికెర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని ఏపీవో నర్సిరెడ్డి హెచ్చరించారు. మంగళవారం మద్దికెర, బీఎన్‌పేట గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. మండలంలో అన్ని గ్రామాల్లో ఉపాధి పనులను ప్రారంభించామని, జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పిస్తామని అన్నారు.

రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రజక కార్పొరేషన్‌కు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని రజక సంఘం అధ్యక్షుడు ముక్కన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రుణాలు మంజూరు చేయాలని, అన్ని గ్రామాల్లో దోబీ ఘాట్లు ఏర్పాటు చేయాలన్నారు. జీవో నెం.27 ప్రకారం ప్రభుత్వ శాఖల్లో దోబీ పోస్టులను రజకులకే ఇవ్వాలన్నారు. ప్రధాన మంత్రి కౌశల్య విశ్వకర్మ పథకం ద్వారా జిల్లాలో 5వేల మంది రజకులకు వారం శిక్షణ ఇచ్చి, ఉపాధి చూపాలన్నారు. జిల్లా కమిటీ సభ్యుడు ఉరుకుంద, పట్టణ అధ్యక్షుడు రామన్న, నాగప్ప, రవి, మల్లప్ప, పెద్ద తుంబళం మహేష్, చిన్నహరివానం భీమ లింగప్ప, మహేష్, రవి పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి

- పత్తికొండలో ర్యాలీ, రాస్తారోకో



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, కార్యదర్శి జగన్నాథం, కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జంబులయ్య డిమాండ్ చేశారు. ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిన రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ ధలేవాల్‌కు మద్దతుగా పత్తికొండలో ర్యాలీ నిర్వహించి, నాలుగు స్తంభాల కూడలిలో ధర్నా చేశారు. జగ్జీత్‌సింగ్ 42 రోజు లుగా ఆమరణ నిరాహారదీక్ష చేపట్టిని కేంద్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడం సరికాదన్నారు.

పాలకులపై పోరాటం చేస్తాం

రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయని పాలకులపై పోరాటం చేస్తామని నాయకులు హెచ్చరిం చారు. సీఆర్ భవన్‌లో జిల్లా సమితి సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు పంపన్నగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. జగన్నాథం, నాగేంద్రయ్య, భీమలింగప్ప, కార్యదర్శి తిమ్మయ్య, రాజాసాహెబ్, వెంకట్రామిరెడ్డి, కారన్న పాల్గొన్నారు.

ఆయకట్టుకు సాగునీరందించేందుకు కృషి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- సాగునీటి సంఘం అధ్యక్షుడుముని రెడ్డి



మద్దికెర, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి గ్రామం లింగాలవాగు డ్యాం ఆయకట్టు రైతులకు సాగునీరందించేందుకు కృషి చేస్తానని సాగు నీటి సంఘం అధ్యక్షుడు ముని రెడ్డి అన్నారు. ఆంధ్రజ్యోతికి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: డ్యాం పరిధిలోని గ్రామాలు ఏవి?

జవాబు: బసినేపల్లి, మదనంతపురం, రాంపురం, రాంపురం కొట్టాల గ్రామాలున్నాయి.

ప్రశ్న: భవిష్యత్తు కార్యాచరణ ఏమిటి?

జవాబు: హంద్రీనీవా కాలువ ద్వారా ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సహకారంతో నీరు వదిలేందుకు కృషి చేస్తా.

ప్రశ్న: ప్రస్తుతం కాలువల పరిస్థితి?

జవాబు: గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కాలువలపై దృష్టి పెట్టకపోవటంతో సాగు నీటి వ్యవస్థ అస్తవ్యవస్తంగా తయారైంది.

ప్రశ్న: లింగాలవాగు డ్యాం విస్తీర్ణం ఎంత?

జవాబు: వంద ఎకరాలు. ప్రస్తుతం నీరు పుష్కలంగా ఉంది. చెరువులో చేపలను కూడా వదిలాం.

ప్రశ్న: మీ పరిధిలో ఎన్ని ఎకరాల ఆయకట్టు ఉంది?

జవాబు: లింగాలవాగు డ్యాం పరిధిలో బసినేపల్లి, రాంపురం, రాంపురం కొట్టాల్లో సుమారు 1000 ఎకరాలకు పైబడి ఆయకట్టు ఉంది. మద్దికెర మండలంతో పాటు తుగ్గలి మండలంలోని అన్ని గ్రామాలు కూడా డ్యాం పరిధిలోకి వస్తాయి.

ప్రశ్న: ఆయకట్టు రైతులు ఉన్నారు?

జవాబు: 265మంది రైతులు ఉన్నారు.

ప్రశ్న: ఏమైనా పనులు చేశారా?

జవాబు: జలవనరుల అధికారులతో కలిసి డ్యాంను పరిశీలించి పనులు చేస్తాం.

ఎమ్మిగనూరు

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

ఉగాదికి తిరిగి వస్తాం

● పండుగకు ముందే వెళ్లిపోతున్న వలస బండ్లు
● స్థానికంగా పనులు లేకపోవడమే కారణం



గోనెగండ్ల నుంచి వలస వెళ్తున్న కూలీలు

గోనెగండ్ల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశ్చిమ ప్రాంతం నుంచి ఈ ఏడాది సంక్రాంతి పండుగకు ముందే వలస బండ్లు కదులుతున్నాయి. స్థానికంగా పనుల లేకపోవడంతో చేసేది లేక కూలీలు రెండు, మూడు రోజులుగా వసలబాట పట్టారు. మంగళవారం పలు గ్రామాల నుంచి పట్టణాలకు కూలీలు వలసలు వెళ్లారు. గ్రామాల్లోని పంట పొలాల్లో పనులు లేకపోవడంతో కూలీలు బతుకుజీవుడా అంటు పొట్ట చేతపట్టుకొని పట్టణ ప్రాంతాలకు వలసలు వెలుతున్నారు. ఉగాది పండుగకు ఊరికి వస్తాం.. లేకపోతే వర్షలు కరిస్తే గ్రామాలకు వస్తామని చెబుతూ కూలీలు వలస బండ్లు ఎక్కి వెళ్తున్నారు. వలస వెళ్తున్న కూలీలను ఆంధ్రజ్యోతి పలకరించింది. గ్రామాల్లోని పొలాలలో పనులు అయిపోయాయి, ఇక పనులు లేవు దీనికి తోడు గ్రామాల్లో అధికారులు సైతం ఉపాధి పనులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర పనులు కల్పించినప్పటికి కూలి గిట్టుబాటు కాకపోవడం, అవీకూడా సకాలంలో చెల్లించడం లేదన్నారు. మండలంలోని వేముగోడు, గోనెగండ్ల, అలువాల, చిన్నమరివీడు, పెద్దనేలటూరు, కులుమాల, బైలుప్పల, అగ్రహారం, గంజహళ్లి తదితర గ్రామాల నుంచి వలస బాటపట్టారు. కూలీల ఇళ్లకు తాళలు పడటంతో గ్రామాల్లో వీధులు నిర్మానుష్యంగా మారాయి.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ. 45లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది

కౌతాళం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామికి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. మంగళవారం దేవస్థానపు కాలక్షేపు మండపంలో ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో విజయరాజు ఆధ్వర్యంలో లెక్కించారు. నగదు రూపంలో రూ.41,26,644లు, అన్నదానం ద్వారా రూ.4,24,846లు మొత్తం రూ.45,51,490లు, బంగారం 19 గ్రాములు, వెండి 6.2 కిలోలు వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి సుధాకర్ రెడ్డి, అధికారులు మల్లికార్జున, వెంకటేశ్వరరావు, దేవాలయ ఉపప్రధాన అర్చకులు మహదేవప్ప, అర్చకులు నాగరాజు స్వామి, శివన్నస్వామి యూనియన్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

రూ.2లక్షలు నష్టం

కోసిగి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అగసనూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వీరారెడ్డి గడ్డివాముకు మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దాంతో గడ్డి పూర్తిగా కాలిపోయి రూ.2లక్షల మేర నష్టం జరిగినట్లు రైతు వీరారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టనివారు నిప్పు పెట్టి కాల్చివేశారని వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానన్నారు. తనను ఆదుకోవాలని రైతు విజ్ఞప్తి చేశారు.

బాల్య వివాహాలు నేరం: కమిషనర్

ఎమ్మిగనూరురూరల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేయడం నేరమని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో డీసీపీవో శారద అధ్యక్షతన సచివాయ వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలకు ఒక్కరోజు కిషోర వికాసం శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, కర్నూలు డీసీపీవో శారద మాట్లాడుతూ కిషోర బాలికలకు తీసుకోవాల్సిన ఆహారం, ఆత్మరక్షణ, వివాహ వయసు, ఆడ పిల్లల చదువు, పోక్సో చట్టాల వంటి విషయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఆంజనేయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన తెలుగు తిమ్మేష్ అనే వ్యక్తి కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తెస్తుండగా ఎస్ఐ పరమేష్‌నాయక్ పట్టుకున్నారు. మంగళవారం మంత్రాలయం గ్రామ శివార్లలో హెలిప్యాడ్ మైదానం వద్ద 120 కర్ణాటక 90 ఎంఎల్ మద్యం టెట్రా ప్యాకెట్లును స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్టుచేశారు. నిందితుడిని ఎమ్మిగనూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కర్ణాటక మద్యం విక్రయించినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఉల్లి సాగుపై అన్నదాత ఆసక్తి

● బావులు, బోర్ల కింద దాదాపు 10వేల ఎకరాల్లో పంట సాగు
● చుక్కలు చూపుతున్న ఉల్లినారు



ఉల్లి నార పనుల్లో మహిళా కూలీలు

గోనెగండ్ల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీలో రైతులు ఉల్లి పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, నియోజకవర్గాల్లోని గ్రామాల్లో చాల మంది రైతులు బావులు, బోర్ల కింద ఉల్లి పంటను అధికంగా సాగుచేస్తున్నారు. ఒక ఎకరం ఉల్లి పంట సాగుకు రూ. 80వేల నుంచి రూ. 90వేల వరకు ఖర్చు వస్తున్నది. . పంట చేతికి అందే సమయానికల్లా పండిన ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నందవరం, కోసిగి, పెద్దకడుబూరు, కౌతాళం, మంత్రాలయం, మండలాల పరిధిలో ఇప్పటికే బావులు, బోర్ల కింద దాదాపు 10 వేల ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేశారు.

చుక్కలు చూపుతున్న ఉల్లినారు

గత సీజన్‌లో ఉల్లి పంటకు గిట్టుబాటు ధర పలకడంతో ఈ సీజన్‌లో రైతులు ఎక్కుగా ఉల్లిపంటను సాగు చేస్తున్నారు. దీంతో ఉల్లినారకు మంచి గిరాకీ పెరిగింది. గోనెగండ్ల మండలంలో 500 ఎకరాల మేర ఉల్లినారు వేసే రైతులు అమ్మకాలు జరుపుతున్నారు. ఒక ఎకరం ఉల్లి సాగుకు 10 నుంచి 12 బిట్ల నారు అవసరం అవుతుంది. ఒక బిటు నారు రూ. 1600 నుంచి రూ. 1800 వరకు పలుకుతుంది. ఉల్లినార సాగు చేసిన రైతులకు కనక వర్షం కురుస్తుంది. ఉల్లిగడ్డకు మంచి ధర లభిస్తే మా కష్టాలు తీరుతాయని రైతులు తెలుపుతున్నారు.

ఉల్లినార ధర విపరీతంగా పెరిగింది

ఈ ఏడాది ఉల్లి పంటను సాగు చేయాలనుకున్నాను. అయితే ఉల్లినారు ధర విపరీతంగా పెరిగింది. ఎకరం ఉల్లినార కవాలంటే రూ. 14వేల నుంచి రూ. 18వేల వరకు ఖర్చు అవుతుంది . దీంతో పెట్టుబడులు పెట్టలేక సాగు చేయడం మానివేశాను.

- మాబు, రైతు గోనెగండ్ల

ఆశతో ఉల్లి సాగుచేశాను

గత రెండుళ్ల క్రితం నాలుగు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాను. రూ. రెండు లక్షలు నష్టం వచ్చింది. ఈ ఏడాదైనా గిట్టుబాటు ధర రాదా అనే ధైర్యంతో రెండు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాను. అంత దైవంపై భారం వేశాం.

- బద్రి, రైతు గోనెగండ్ల

గురుకుల కళాశాల పరిశీలన

విద్యార్థినులు, అధ్యాపకులను విచారించిన ట్రైనీ కలెక్టర్



విద్యార్థినులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ కల్యాణి

ఎమ్మిగనూరు రూరల్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి గురుకుల కళాశాలను ట్రైనీ కలెక్టర్ కల్యాణి పరిశీలించారు. కళాశాలలో కలియ తిరిగారు. వారం రోజుల క్రితం కళాశాలలో జరిగిన ఘటనపై విద్యార్థినులను, అధ్యాపకులను వేర్వేరుగా విచారించారు. విద్యార్థినులతో కలిసి డార్మెంటరీ, చికెన్ గదులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమకు ఇక్కడ సౌకర్యాలు సక్రమంగా లేవని, వర్షాకాలం భయంభయంతో ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. తమకు వార్డెన్, ఏఎన్ఎంలను ఏర్పాటు చేయాలని కోరారు. రాత్రివేళల్లో దోమలు, చలితో పడుతున్న ఇబ్బందులతో పాటు మరుగుదొడ్ల సమస్యలను ట్రైనీ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ట్రైనీ కలెక్టర్ కల్యాణి విలేకర్లతో మాట్లాడుతూ విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను, జరిగిన సంఘటనపై విచారించామన్నారు. నివేదికను తయారు చేసి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థి సంఘాల నాయకులు వీరేష్‌యాదవ్, మహేంద్రబాబు, శేఖర్, ఉదయ్, సురేంద్ర, ఉసేని, ఖాజా కళాశాలలో విద్యార్థినులకు సౌకర్యాలను కల్పించాలని, నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఎంఈవో-1 ఆంజనే యులు, ట్రైనీ లెక్టర్ వెంట డీటీ వీరేంద్రగౌడు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గీర్వాణి, ఎస్ఐ కె.శ్రీనివాసులు, వీఆర్వో మోహన్ పాల్గొన్నారు.

మంత్రాలయం అభివృద్ధికి కృషి

మఠం ఏఏవో మాధవశెట్టి



దేవదాయ, ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడుతున్న మఠం ఏఏవో మాధవశెట్టి

మంత్రాలయం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంతోపాటు మంత్రాలయం అభివృద్ధికి కృషి చేయాలని మఠం ఏఏవో మాధవశెట్టి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు దేవాదాయశాఖ కమిషనరేట్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌డీ వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్, డీఈ నాగరాజు, మఠం ఈఈ సురేష్ కోనాపూర్, మేనేజర్ వెంకటేశ్‌జోషీ, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాసరావులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనుల్లో భాగంగా రింగ్ రోడ్డు, బైపాస్ రోడ్డు, అండర్ డ్రైనేజీ వంటి అంశాలపై చర్చించారు. అనంతరం గోశాల, సంస్కృత పాఠశాల, పరిమళ విద్యానికేతన్, శ్రీమఠం ఆసుపత్రి, మంత్రాలయంలో చేపట్టిన తుంగ జలప్రసాదం మినరల్ వాటర్ ప్లాంటు, ఈ మధ్య నిర్మించిన 300 గదుల సముదాయాన్ని పరిశీలించారు. రాఘవేంద్రస్వామి మఠం చేస్తున్న అభివృద్ధి పనులపై నివేదిక తయారు చేసి రాష్ట్ర కమిషనర్ సత్యనారాయణకు పంపనున్నట్లు కమిషనరేట్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంతపు రాణిక్, జనార్దన్‌రావు, గిరిధర్, శ్రీపాదాచార్, సుజ్ఞానేంద్రాచార్, నాగరాజు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు న్యాయం చేస్తాం



వగరూరులో అర్జీలను పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సరస్వతి

మంత్రాలయం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే ప్రతి సమస్యను పరిష్కరించి న్యాయం చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ సరస్వతి అన్నారు. మంగళవారం వగరూరు గ్రామంలో వీఆర్వో ప్రభాకర్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భూమి కొలతలు, తేడాలు, సర్వేనెంబర్ల తప్పులు, పేరు మార్పులు, మ్యుటేషన్, సరిహద్దు వివాదాలు ఉన్న రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో వీఆర్వో ఆనంద్, సర్వేయర్ రాధ, గ్రామ కార్యదర్శి దశరథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణ రథంపై ప్రహ్లాదరాయలు



స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై విహరించారు. మంగళవారం ధనుర్మాసం అష్టమిని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తికి ఊంజల సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మఠం పండితులు భక్తులకు ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. పాదయాత్రతో వచ్చిన కర్ణాటక భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది.

హామీలను అమలు చేయాలి

ఎమ్మిగనూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి యేసేపు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి అనీఫ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలన్నారు. హామీలు అమలు చేయకుండా రాష్ట్ర పర్యటనకు రావడం తగదన్నారు. రాష్ట్రంలోని ఎన్డీయే కూటమి సభ్యులు విభజన చట్టంలోని హామీలపై నోరు మెదపకపోవడం ఏమిటన్నారు. అలాగే రాష్ట్రంలోని నారాలోకేష్‌కు యువత ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్ పేరుతో గాలిలో మేడలు కడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఉద్యమాలు చేపడతామన్నారు. సమావేశంలో షడక్, బాలాజి, బుడ్డన్న, నాగేష్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యేసేపు

కౌన్సిల్ సమావేశం సజావుగా సాగేనా?

● వాదోపవాదాలతో ముగిసిన గత సమావేశాలు
● విమర్శలు వ్యక్తం చేస్తున్న పట్టణ వాసులు



ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయం

ఎమ్మిగనూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి ఓ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది.. వివాదాలకు తావులే కుండా అభివృద్ధే ధ్యేయంగా కౌన్సిల్ సభ్యులు విమర్శలు, సబ్ విమర్శలు చేసుకుంటూనే పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడుపుతూ వచ్చారు. అయితే గత నాలుగైదు నెలలుగా మున్సిల్ కౌన్సిల్ సమావేశాలు వివాదాలకు..వాగ్వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతూ వస్తున్నాయి. ఎమ్మిగనూరు పట్టణంలో 34వార్డులతో దాదాపు 1.20లక్షల జనాభా ఉంది. పట్టణంలో నేటికి శివారు ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ దీపాల వంటి సౌకర్యాలు లేక ఆయా ప్రాంతాల వాసులు ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. అలాగే ఎప్పుడో 40ఏళ్ల క్రితం పట్టణంలో తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన పైపులైన్లు సైతం అడుగుల్లోతుకు వెళ్లి శిథిలావస్థకు చేరాయి. దీంతో పట్టణ వాసులు గుంతలు తవ్వుకొను నీటిని తోడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేగాక గత టీడీపీ హయాంలో పేదల కోసం నిర్మించిన మూడువేల టిడ్కో గృహాలు లబ్ధిదారుల కోసం ఎదురు చూస్తున్నాయి. అంతేగాక ప్రతి ఏడాది ప్రవేశపెట్టే బడ్జెట్‌లో అభివృద్ధి పనుల కోసం, జీతభత్యాల కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నారు. అయితే పట్టణంలోని స్త్రీ శిశు సంక్షే మానికి, దివ్యాంగుల సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించక పోవడం విమర్శలు దారితీస్తుంది. మరీ ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంతకుముందు పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన కోట్ల రూపాయల బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఏడు నెలలుగా కళ్లకు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. ఎన్నో అష్టకష్టాల కోర్చి పనులు చేస్తున్నా బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇన్ని సమస్యలు ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో ప్రజలను వేధిస్తున్నా కౌన్సిల్‌లోని ప్రతిపక్ష, పాలకవర్గ సభ్యులు ఏదో ఒక విషయంపై వాదోపవాదాలకు దిగడం, రాద్ధాంతం చేస్తూ కొద్ది వ్యవధిలోనే చర్చలు లేకుండా ముగిస్తుండడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇవి కౌన్సిల్ సమావేశాలా? లేక.. వాగ్వాద సమావేశాలా? అని ప్రజలు చర్చించుకుంటున్నారు. కనీసం నేడు జరిగే సమావేశంలోనైనా ప్రజా సమస్యలపై అధికార, ప్రతిపక్ష సభ్యులు చర్చిస్తారో..లేదో వేచి చూడాల్సి ఉంది.

కమిషన్‌ను ఏర్పాటు చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న డీటీఎఫ్ నాయకులు

గోనెగండ్ల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల కోసం నూతన వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప డిమాండ్ చేశారు. మంగళవారం హెచ్ కైరవాడి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈనెల 11న విజయవాడలో డీటీఎఫ్ ఆధ్వర్యంలో చేపడుతున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యారంగంపై ప్రభుత్వం అనుసరిస్తున్న అశాస్త్రీయ విధానాలను వీడనాడాలని కోరారు. మాతృభాష మాధ్యమాలను సమాంతర బోధన మాధ్యమాలుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులపై మోపుతున్న యాప్ భారం తగ్గించాలని కోరారు. ప్రభుత్వం మోడల్ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు ప్రతిపాదనలను విరమించుకోవాలన్నారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యను ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాకు మార్చలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



అన్న క్యాంటీన్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు, జనవరి 7(ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్లలోని ప్రజలకు అందించే భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని శ్రీనివాస సర్కిల్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌లో భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం అతి తక్కువ ధరకే భోజనం అందిస్తుందని, భోజనంలో ఎలాంటి లోటుపాట్లు ఉండరాదన్నారు. క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ప్రధాన రహదారి, డివైండర్ పనులను ఆయన పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని, వీలైనంత మేరకు త్వరలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

రైతులకు కుచ్చుటోపీ పెట్టిన తలారీ

నకిలీ పాసు పుస్తకాలు, చెల్లని చెక్కులు ● కోసిగి సీఐకి ఫిర్యాదు చేసిన రైతులు

కోసిగి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు మండలం పులికనుమ గ్రామ తలారి తిక్కయ్య తమను మోసం చేశాడని రైతులు మంగళవారం కోసిగి సీఐ మంజునాథ్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన రైతు మేకడోన ఉరుకుందకు పంట నష్టపరిహారం, కొత్తపాసు పుస్తకాలు ఇప్పిస్తానని చెప్పి రూ.1.10 లక్షలు డబ్బులు వసూలు చేసి కలర్ ప్రింటులో నకిలీ చెక్కులు ఇచ్చి మోసం చేసినట్లు తెలుస్తోంది. అలాగే అదే గ్రామానికి చెందిన భోంపల్లి హుశేని అనే కౌలు రైతు ఎకరాకు రూ.40వేల ప్రకారం ఐదెకరాలకు నష్టపరిహారం అకౌంటులో వేయిస్తామని చెప్పి రూ.1.30 లక్షలు రెండు విడతలుగా డబ్బులు తీసుకొని, ఆ తర్వాత చెల్లని చెక్కులు ఇచ్చాడనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే కొండగేని తిమ్మప్ప అనే కౌలు రైతుకు నష్టపరిహారం వేయిస్తామని చెప్పి రూ.10వేలు తీసుకున్నాడని, కోసిగికి చెందిన రైతు చింతలగేని మారయ్యకు డి.పట్టా ఇస్తానని చెప్పి రూ.1.57లక్షలు వసూలు చేసినట్లు తెలుస్తోంది. అలాగే చిన్నతుంబళం గ్రామానికి చెందిన రైతు ఈరన్న తన తల్లిదండ్రులు మరణించడంతో తనకున్న 4ఎకరాల 88 సెంట్ల భూమి తన తల్లిదండ్రుల పేరు నుంచి తన పేరు మీద పాసు పుస్తకాలు ఇప్పిస్తానని చెప్పి రూ.2.10లక్షలు డబ్బులు తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే హెబ్బటం నలారెడ్డి కౌలురైతుకు పంట నష్ట పరిహారం ఇస్తానని రూ.35వేలు తీసు కుని నకిలీ చెల్లని చెక్కులు అంద జేశాడని, బాధితులు పెద్దకడుబూరు తహసీల్దార్‌కు, ఆదోని సబ్ కలెక్టర్, కోసిగి సీఐకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రైతులు

వరినారుకు గడ్డిమందు

మహిళ రైతుకు తీవ్ర నష్టం

కోసిగి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వరినారుకు గడ్డిమందు కొట్టడంతో నారు ఎండిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందని వందగల్లు గ్రామానికి చెందిన సరస్వతి అనే మహిళ రైతు ఆవేదన వ్యక్తం చేసింది. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కావాలనే తన పొలంలోని నారుకు గడ్డిమందును పిచికారి చేశారని వాపోయింది. కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.



వందగల్లులో వరినారుకు గడ్డిమందు కొట్టడంతో ఎండిపోయిన పైరు

తప్పొప్పులను సరి చూసుకోవాలి

గోనెగండ్ల, జనవరి 7(ఆంధ్రజ్యోతి): స్వర్ణ పంచాయతీ ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను సరి చేసుకోవాలని ఈవోఆర్‌డీ అనంతశైయనా, గోనెగండ్ల పంచాయతీ ఈవో సతీష్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో గృహాలను ఆన్‌లైన్ చేసుకునే కార్యక్రమం ముగిసిందని, అయితే కొన్ని తప్పొప్పులు జరిగి ఉండవచ్చని, సమీపంలోని పంచాయతీ కార్యాలయానికి వెళ్లి వివరాలు సరి చేసుకోవాలన్నారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ హైమావతి, శానిటరి ఇన్‌స్పెక్టర్ మలాంగ్, సుబాన్, అనిల్, పాల్గొన్నారు.



ఆన్‌లైన్‌లో తప్పులను సరిచేస్తున్న సిబ్బంది